Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 265 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 14 అక్టోబర్ 2023 | శనివారం | పేజీలు : 4

## గంగాజలంపై 18% జీఎస్టీ దోపిడీకి పరాకాష్ఠ: ఖర్గే

న్యూఢిల్లీ : కోట్లాదిమంది హిందువులు పరమ పవిత్రంగా భావించే గంగాజలంపై కేంద్రప్రభుత్వం 18% జీఎస్టీ విధిస్తోందని.. ప్రభుత్వ దోపిడీకి, కపటత్వానికి ఇది పరాకాష్ఠ అని కాంగ్రెస్ ఆరోపించింది. గురువారం ప్రధాని మోదీ ఉత్తరాఖండ్ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్'లో ఈ మేరకు పోస్ట్ చేశారు. 'ఒక సాధారణ హిందువుకు పుట్టుక నుంచి మరణం వరకూ తల్లి గంగానది ప్రాధాన్యం సాటిలేనిది. మీ ప్రభుత్వం అలాంటి గంగాజలంపైనే 18% జీఎస్టీ విధించింది. గంగాజలాన్ని ఆర్డర్ చేసి తెప్పించుకోవాలనుకునే వారికి ఇది భారమే. మీరు దీన్ని పట్టించుకోనే లేదు'అని ఖర్గే విమర్శించారు. అయితే గంగాజలంపై జీఎస్టీ విధించటం లేదని పరోక్ష పన్నులు, కస్టమ్స్ సెంట్రల్ బోర్డు (సీబీఐసీ) 'ఎక్స్'లో వెల్లడించింది.



# మన పరిస్థితేంటి!?

## 'ప్యారాచూట్ లీడర్స్ ఎంట్రీతో

## ఆందోళన బాట పట్టనున్న కాంగ్రెస్ బీసీ నేతలు!!

హైదరాబాద్ : తెలంగాణాకు తొందరలో జరగబోయే ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు కాంగ్రెస్ పార్టీలో రెబల్స్ రెడీ అవుతున్నారా ? పార్టీ వర్గాల సమాచారం, ఢిల్లీ వర్గాలను బట్టి అవుననే అనుకోవాలి.

విషయం ఏమిటంటే రాబోయే ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు టికెట్లు ఇవ్వాల్సిందే అని బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై అధిష్టానం మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం కాకపోయినా ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలోను రెండు సీట్లను బీసీలకు కేటాయించాలని అనుకున్నది. ఇదే విషయాన్ని తమను కలిసిన బీసీ నేతలకు గతంలో ఏఐసీసీ అగ్రనేతలు చెప్పారు. దాంతో ఎంతో కొన్ని సీట్లు దక్కుతున్నాయి కదాని బీసీ నేతలు హ్యాపీగానే ఫీలయ్యారు. అయితే ఈమధ్య పార్టీలో పరిణామాలు మారిపోతున్నాయి. బీఆర్ఎస్, బీజేపీల నుండి వస్తున్న రెడ్డి, వెలమ నేతలకు సీట్లు ఖాయంచేస్తున్నారు. దాంతో తాము పోటీచేసే నియోజకవర్గాలపైనే ప్రభావం పడుతుందని బీసీ నేతల్లో టెన్షన్ మొదలైంది. ఇదే విషయమై స్పష్టమైన హామీ కోసం బీసీ నేతలు ఢిల్లీకి వెళ్ళారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో భేటీ అయినపుడు వీలున్నంతలో 34 సీట్లను బీసీలకు కేటాయించాలని అధిష్టానం డిసైడ్ అయిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే కేసీ గుర్తు చేస్తున్నట్లుగా పార్టీలో పరిస్థితులు లేవని నేతలు ఆందోళన పడుతున్నారు. తాము అడిగినన్ని సీట్లు కాకపోయినా కనీసం 34 సీట్లయినా కేటాయించకపోతే తిరుగుబాటు చేయాల్సిందే అని బీసీ నేతల్లో తీవ్రమైన చర్చ నడుస్తోంది. అవసరమైతే బీసీ జనాభా ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో రెబల్ అభ్యర్థులుగా నామినేషన్లు వేయాలనే చర్చ పెరిగిపోతోంది. సర్వేల పేరుతో, ప్యారాచూట్ నేతలకు టికెట్లిచ్చి చివరకు పార్టీనే నమ్ముకుని ఉన్న తమకు అన్యాయం చేయద్దని బీసీ నేతలు పార్టీ అగ్రనేతలకు విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే ఎవరితో ఎంతమాట్లాడినా తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకాలు లేవని కూడా బీసీ నేతలు అంటున్నారు. ఈ పరిస్థితుల్లోనే అభ్యర్థులను ఫైనల్ చేసే విషయంలో ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటి ఒకటికి రెండుసార్లు సమావేశమవుతోంది. మరి చివరకు అధిష్టానం ఏమిచేస్తుందో ? బీసీ నేతలు ఏమంటారో చూడాల్సిందే.




## కవిత లిక్కర్ బోర్డు తెస్తే.. నేను పసుపు బోర్డు తెచ్చిన

జగిత్యాల జిల్లా: బీఆర్ఎస్ నేతల లాగా తాను కబ్జాలు చేయనని, లంచాలు తీసుకుని ఉద్యోగాలు ఇవ్వనని, నాలుగు పైసల అవినీతి కూడా తనమీద లేదని, ఉండదని నిజామాబాద్ జిల్లా బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు.

ఈ సందర్భంగా శుక్రవారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ దలారి వ్యవస్థను పెంచింది కాంగ్రెస్ అని, రాజకీయంగా కవిత తనను అందుకోలేరని అన్నారు. కవిత లిక్కర్ బోర్డు తెస్తే.. తాను పసుపు బోర్డు తీసుకువచ్చానని అన్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తాళలు తెరిపిస్తానని స్పష్టం చేశారు. ఇందూర్ పార్లమెంట్‌లో హుందాతనం రావాలని ధర్మపురి అరవింద్ అన్నారు.

## అవినీతి సొమ్ముతో కాంగ్రెస్ గెలవాలనుకుంటోంది




మెదక్: కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా గెలిచేది బీఆర్ఎస్ పార్టీ అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మెదక్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ బెంగళూరులో ఓ రాజకీయ పార్టీ నేత ఇంట్లో దొరికిన రూ.42 కోట్ల నగదుపై మాట్లాడారు. "బెంగళూరు నగరంలో జరిగిన ఐటీ దాడుల్లో కాంగ్రెస్ పార్టీ నేత ఇంట్లో నోట్ల కట్టలు బయటపడ్డాయి. అక్రమంగా సంపాదించిన అవినీతి సొమ్మును తెలంగాణకు బదిలీ చేసే ప్రయత్నం కాంగ్రెస్ చేసింది. ఎన్నికల్లో డబ్బు పంచి గెలిచే ప్రయత్నం. కర్ణాటకలో గతంలో 40 శాతం కమిషన్ ప్రభుత్వం ఉంటే.. ఇప్పుడు 50 శాతం కమిషన్ ప్రభుత్వం ఉంది. కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న అంబికాపతి ఆ రోజుల్లో 40 శాతం కమిషన్‌తో పని చేసేవారు. నేడు అదే అంబికా పతి 50% కమిషన్ వసూలు చేసి తెలంగాణ రాష్ట్రానికి బదిలీ చేస్తున్నారు. అంబికాపతి సతీమణి గతంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్. ఇద్దరు ఇంట్లో ఉండగానే ఐటీ దాడులు జరిగాయి. ఐటీ దాడుల్లో రూ. 42 కోట్ల నగదు దొరికాయి. తెలంగాణకు తరలించేందుకు కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేసిన డబ్బు ఇది అని తెలుస్తుంది." అని మంత్రి పేర్కొన్నారు. "బెంగళూరులో దొరికిన డబ్బుపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలి. అంబికాపతి డీకే శివ కుమార్‌కు అత్యంత సన్నిహితుడు అని.. అలాగే ఈశ్వరప్పకు కూడా సన్నిహితుడు అని తెలుస్తోంది. తెలంగాణ టాక్స్ పేరుతో డబ్బులు వసూలు చేసి పంపే కుట్ర చేస్తున్నారు. కర్ణాటక నుంచి దాదాపు 1500 కోట్ల రూపాయలు బిల్డర్ల దగ్గర నుంచి, వ్యాపారుల నుంచి, కాంట్రాక్టర్ దగ్గర నుంచి వసూలు చేసి తెలంగాణ ఎన్నికల్లో ఖర్చు చేయాలని భావిస్తోంది. ఈ అక్రమ వసూళ్లకు తెరలేపింది కాంగ్రెస్ పార్టీ. బెంగళూరు నుంచి వయా చెన్నై ద్వారా హైదరాబాద్‌కు పంపాలని ప్లాన్. ఇందులో కొందరు బిల్డర్లు, కాంట్రాక్టర్లు పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది." అని వెల్లడించారు. "తెలంగాణలో దొడ్డి దారిన కాంగ్రెస్ గెలిచే ప్రయత్నం చేస్తోంది.

కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులను నిర్ణయించుకోలేని పరిస్థితి. టికెట్లు తెచ్చుకోలేని పార్టీ. సగం సీట్లలో కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు కరవు. పక్కా పార్టీల వైపు దిక్కులు చూస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. షెడ్యూల్ వచ్చినా టికెట్లు డిక్లేర్ చేసుకోలేని దుస్థితి. సగం సీట్లలో అభ్యర్థులు కరవైన పార్టీ కాంగ్రెస్. సోషల్ మీడియా వేదికగా ఫేక్ ప్రచారం చేస్తోంది తప్ప ప్రజల్లో ఆదరణ లేదు. కాంగ్రెస్ నీతి ఏమిటీ అనేది బయట పడింది. తెలంగాణ ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. తెలంగాణ సమాజం ఎన్నటికీ సహించదు. మీకు తగిన గుణపాఠం తప్పదు." అని కాంగ్రెస్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు.




# పొన్నాల దారెటు?

## రాజీనామా తర్వాత ఏ పార్టీలో చేరబోతున్నారంటే..?

జనగామ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. దీంతో శుక్రవారం నాడు కాంగ్రెస్ పార్టీకి పొన్నాల రాజీనామా చేశారు. గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమాలకు పొన్నాల దూరంగా ఉంటూ వస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే సమయంలో పొన్నాల తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు.

జనగామ నుంచి కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి టికెట్ కేటాయిస్తారని ప్రచారం జరగడంతో పొన్నాల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పొన్నాల రాజీనామాతో జనగామ కాంగ్రెస్‌పై తీవ్ర ప్రభావం పడనుంది. పొన్నాలతో పాటే ఆయన అనుచరులు కూడా కాంగ్రెస్ పార్టీని వీడే అవకాశాలు ఉన్నాయి. తన క్యాడర్‌తో చర్చించాకే పొన్నాల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో బీసీ నాయకుడిగా పొన్నాల లక్ష్మయ్య బలమైన ముద్ర వేశారు. రాష్ట్ర రాజకీయాల్లో బీసీ కమ్యూనిటీ ప్రభావం అధికంగా ఉంటుంది.

**ఆ రోజే పొన్నాల బీఆర్ఎస్‌లో చేరబోతున్నారా..? :** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీల ఓటు బ్యాంకును బీఆర్ఎస్ పార్టీకి మళ్లించుకునేలా పావులు కదుపుతోంది. ప్లాన్‌లో భాగంగా పొన్నాలను బీఆర్ఎస్‌లో చేర్చుకునేలా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పథకం రచిస్తున్నారు. ఇందులో భాగంగా పొన్నాల ఇంటికి మంత్రి కేటీఆర్ మరికాసేపట్లో వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

ఈ నెల 16వ తేదీన జనగామలో కేసీఆర్ సభ నిర్వహించనున్నారు. అదే రోజు BRSలో పొన్నాల చేరే అవకాశాలు ఉన్నాయి. BRS జనగామ అభ్యర్థిగా పొన్నాలను ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయని గులాబీ పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. ఇంకా జనగామ అభ్యర్థిని కేసీఆర్ ప్రకటించలేదు.

**కాంగ్రెస్‌కు జనగామలో నష్టమేనా..? :** కాగా పొన్నాల రాజకీయ భవిష్యత్తు కోసం బీఆర్ఎస్‌లో చేరుబోతున్నట్లు విశ్వాసనీయ సమాచారం. పొన్నాల బీఆర్ఎస్‌లో చేరితే జనగామ, తెలంగాణ రాజకీయాలు అనూహ్య మార్పుకు నాంది కాబోతున్నాయి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి సీఎంలుగా ఉన్నసమయంలో కాంగ్రెస్ పార్టీలో పొన్నాల చక్రం తిప్పారు. 2018 ఎన్నికల్లోనూ పొన్నాలకు టికెట్ ఇవ్వకపోవడంతో బాహాటంగానే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్యన పార్టీలోకి వచ్చిన నేతలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం కూడా పొన్నాలకు నచ్చలేదు.

దీంతో ఆయన పలుమార్లు ఢిల్లీ హైకమాండ్‌కి ఈ విషయాన్నిపదే పదే చెబుతూ వస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి జనగామ టికెట్‌ను ఎమ్మెల్సీ పల్లారాజేశ్వరరెడ్డికి ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. జనగామ ప్రస్తుత ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి టీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా సీఎం కేసీఆర్ అవకాశం ఇచ్చారు. దీంతో జనగామ బరి నుంచి పల్లా రాజేశ్వరరెడ్డికి పార్టీ టికెట్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పొన్నాల బీఆర్ఎస్ పార్టీలో చేరితే.. పొన్నాలకు ఉన్న ఓటు బ్యాంకు బీఆర్ఎస్ వైపు మళ్లీ కాంగ్రెస్ పార్టీకి నష్టాన్ని చేకూర్చే ప్రమాదం ఉంది.

జనగామ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు సులువు అవుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని నిలబెట్టకుండా పొన్నాలనే అభ్యర్థిగా నిలబెట్టే అవకాశాలు ఉన్నాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. జనగామ నియోజకవర్గంలో బీసీ కమ్యూనిటీ అధికంగా ఉంటుందని ఇందులో భాగంగానే పొన్నాలను బీఆర్ఎస్ తరపున అసెంబ్లీ బరిలో నిలిపే అవకాశాలు ఉన్నాయని మరో ప్రచారం జరుగుతోంది.

# సంపాదకీయం

## ఆ యుద్ధంతో భారత్ మీద అంత వాణిజ్య ప్రభావం పడనుందా?

ఇప్పుడున్న సమస్యలు సరిపోనట్లుగా.. అంతర్జాతీయంగా ఇజ్రాయెల్ – హమాస్ మధ్య నెలకొన్న యుద్ధం ప్రపంచం మీద ప్రభావాన్ని చూపుతోంది. మరి.. మన దేశం మీద.. ముఖ్యంగా వాణిజ్య కార్యకలాపాల మీద చూపే ఎఫెక్టు ఎంత? దీని వల్ల జరిగే బిజినెస్ లాస్ ఎంత? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. తాజా యుద్ధంతో భారత్ – ఇజ్రాయెల్ మధ్య జరిగే వ్యాపారంలో ముఖ్యంగా రత్నాలు.. ఆభరణాల వ్యాపారం మీద ప్రభావాన్ని చూపుతుందని చెబుతున్నారు. ఈ రెండు దేశాల మధ్య రత్నాలు.. అభరణాల వాణిజ్యం ఒక్కటే 2.8 బిలియన్ డాలర్లుగా చెబుతున్నారు. భారత్ – ఇజ్రాయెల్ మధ్య మొత్తం వాణిజ్య విలువ దగ్గర దగ్గర 12 బిలియన్ డాలర్లుగా చెప్పొచ్చు. మన రూపాయిల్లో చెప్పాలంటే ఇంచుమించు రూ.10వేల కోట్లకు దగ్గరగా ఉంటుందని చెప్పాలి. భారత్ నుంచి ఇజ్రాయెల్ కు కట్.. పాలిష్ వజ్రాలు ఎగుమతి అవుతుంటాయి. ఇజ్రాయెల్ నుంచి భారత్ కు ప్రధానంగా రఫ్ వజ్రాల దిగుమతి సాగుతుంటుంది. ఇజ్రాయెల్ తో జరిగే వాణిజ్యంలో భారత్ నుంచి ఇజ్రాయెల్ కు ఎక్కువగా ఎగుమతులు జరుగుతుంటాయి. అక్కడి నుంచి దిగుమతులు తక్కువ. అంటే.. విదేశీ మారకద్రవ్యం ఇజ్రాయెల్ వాణిజ్యం కారణంగా ఎక్కువగా లభిస్తుంది. గణాంకాల్లో చెప్పాలంటే.. భారత్ నుంచి ఇజ్రాయెల్ కు ఏటా 8.4 బిలియన్ డాలర్లు జరిగితే.. ఆ దేశం నుంచి భారత్ కు జరిగే దిగుమతులు 2.3 బిలియన్ డాలర్లు మాత్రమేనని చెబుతారు. అంటే.. ఏడాదికి ఇజ్రాయెల్ తో వాణిజ్యంలో భారత్ కు 6.1 బిలియన్ డాలర్ల మిగులు ఉంటుందన్న మాట. ఇజ్రాయెల్ కు భారత్ నుంచి కట్.. పాలిష్ వజ్రాలు.. డీజిల్ ఎక్కువగా ఉంటాయి. అదే సమయంలో ఇజ్రాయెల్ నుంచి భారత్ కు రఫ్ డైమండ్స్.. కట్ అండ్ పాలిష్డ్ వజ్రాల తో పాటు ఎలక్ట్రానిక్స్.. టెలికం పరికరాలు.. పొటాషియమ్ క్లోరైడ్.. హెర్బిసైడ్ లు ఉంటాయి. ఈ రెండు దేశాల మధ్య వాణిజ్యం ఎర్ర సముద్రంలో ఉన్న ఈలాట్ నౌకాశ్రయం ద్వారా జరుగుతుంది. యుద్ధం దీర్ఘకాలం సాగితే భారత్ పైన ప్రభావాన్ని చూపుతుంది.. ఆభరణాల మార్కెట్ ఒడిదుడుకులకు లోనవుతుందని చెబుతున్నారు.

# ఆక్రమణలకు హద్దే లేదు!



నర్సంపేట : జిల్లాతోపాటు వరంగల్ మహానగర పరిధిలో చెరువులు, కుంటలు, అనుబంధ నాలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ప్రైవేటు వ్యక్తుల చెరలో చెరువులు కుదించుకుపోతున్నాయి. నగరం శరవేగంగా విస్తరించడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. సంధు దొరికితే చాలు రాత్రికి రాత్రే చెరువులు, కుంటలు, శిఖం భూములు ప్లాట్లుగా మారుతున్నాయి. ఇప్పటికే కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లో చెరువులు, కుంటలు కనుమరుగై కాలనీలయ్యాయి. 42 విలీన గ్రామాల్లోనైనా కాపాడాలని పర్యావరణ వేత్తలు, సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు. రెవెన్యూ, భూమి, కొలతల శాఖోలు హద్దులు తేల్చడం లేదు. చెరువులు, కుంటలు, పంట కాలువలు, పూడ్చి పెద్ద పెద్ద భవనాలు, నివాస గృహాలు నిర్మిస్తున్నా నీటి పారుదల, రెవెన్యూ శాఖ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పాతకాలం నాటి రికార్డుల ప్రకారం క్షేత్రస్థాయిలో చెరువులు, కుంటలు, అనుబంధ కాల్వలు కనిపించడం లేదు. లోకాయుక్త న్యాయస్థానం ఆదేశించినా అధికారులు కదలడం లేదు.

**కాగితాల్లోనే వివరాలు**

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) పరిధిలో 1000 చెరువులు, కుంటలు ఉన్నాయిని వరంగల్ నూతన బృహత్ ప్రణాళికలో పొందుపరిచారు. పాతకాలం నాటి రికార్డులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ వివరాల ఆధారంగా చూపించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో 200 చెరువులు, కుంటలు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇందులో సగం వరకు ఆక్రమణలో ఉన్నాయని అధికారులంటున్నారు.

**ఎఫ్‌టీఎల్ నిబంధనలున్నా..**

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో చెరువులు, కుంటలు కాపాడుకోవాలని భారత అత్యున్నత న్యాయస్థానం(సుప్రీంకోర్టు) 2012లో పూర్తి స్థాయి చెరువు నీటి మట్టం(ఎఫ్‌టీఎల్) అమలు చేయాలని ఆదేశాలు జారీచేసింది. 2013 నుంచి దేశవ్యాప్తంగా ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయి. కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లో 15 చెరువులకు ఎఫ్‌టీఎల్ హద్దులు పెట్టాలని నిర్ణయించారు. తొలి విడతలో 9 చెరువులకు క్షేత్రస్థాయిలో సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేశారు.

**ఇదిగో చిట్టా**

కాజీపేట బంధం చెరువు సగం కనుమరుగైంది. ఎఫ్‌టీఎల్ నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయి.

హనుమకొండ పెద్ద వడ్డేపల్లి చెరువు ప్రైవేటు చెరలో ఉంది. పదేళ్లవుతున్నా ఇంతవరకు ఎఫ్‌టీఎల్ హద్దులు ఖరారు చేయలేదు. దీంతో చెరువు చుట్టూ వాణిజ్య, నివాస భవనాలు వెలిశాయి.

హంటర్ రోడ్ న్యూశాయంపేట కోటి చెరువు విస్తీర్ణం తగ్గింది. భట్టుపల్లి రోడ్, రైల్వేగేటు వద్ద ఆక్రమణలున్నాయి.

వరంగల్- హనుమకొండ నగరాల మధ్య ఉన్న భద్రకాళి చెరువు విస్తీర్ణం ఏటేటా తగ్గుతోంది. ఎఫ్‌టీఎల్ నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు వచ్చేశాయి. కొందరు ప్రైవేటు వ్యక్తులు చెరువు మాదేనంటూ తాజాగా తెరమీదకు వచ్చారు.

ములుగురోడ్ కోట చెరువును ప్లాట్లుగా మార్చేస్తున్నారు. గౌతమినగర్, కేఎల్.మహేంద్రనగర్, డాక్టర్స్ కాలనీ వైపు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించేశారు. ఎఫ్‌టీఎల్ నిబంధనలు పాటించడం లేదు.

వరంగల్ దేశాయిపేట చిన్నవడ్డేపల్లి చెరువును మింగేస్తున్నారు. చుట్టూ నివాస గృహాలు, బడా భవనాలు వెలిశాయి. తాజాగా కొందరు పేదలు చెరువులోనే గుడిసెలు వేశారు. ఎఫ్‌టీఎల్ నిబంధనలు గాలికొదిలేశారు.

రంగశాయిపేట బెస్తం చెరువు పరిసరాలు కాలనీలుగా మారాయి. వరద నీరు పారే నాలాను మూసేశారు.

రంగశాయిపేట మద్దెలకుంట, పుల్లాయికుంట స్థలాలు కాలనీలయ్యాయి.

ఉర్సు రంగసముద్రం చెరువు చుట్టూ ఆక్రమణలే. వరద నీరు పారే నాలాను కొందరు ప్రైవేటు వ్యక్తులు ప్లాట్లు చేసి అమ్మేశారు.

గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, మామునూరు, వసంతపూర్, నక్కలపల్లి, బొల్లికుంట, కడిపికొండ, భట్టుపల్లి, హసన్‌పర్తి తదితర విలీన గ్రామాల్లో చెరువులను స్థిరాస్తి వ్యాపారులు ప్లాట్లు చేస్తున్నారు.

**ఎటు చూసినా నిర్మాణాలే..**

ఇది మాధన్నపేట పెద్ద చెరువు పెద్ద కాలువ. నర్సంపేట పట్టణాన్ని ఆనుకొని మొత్తం 7 కి.మీ నిడివితో ఉంటుంది. సుమారు 4 కి.మీ. పొడవునా ఎడమ వైపు గట్టు భూమిని కలుపుకుని పక్కా నిర్మాణాలు చేశారు. కాలువ కుడి వైపునుండే ఆయకట్టు రోడ్డును పలువురు స్థిరాస్తి వ్యాపారులు వారి సొంత ఆస్తిలా కలుపుకొని వెంచర్ రహదారిగా చూపించి ప్లాట్లు అమ్మి రెండు చేతులా సంపాదిస్తున్నారు.

**ఉనికే లేని 'జాలుబంధం'..**

పాకాల చెరువు కింద సర్వాపురం, ద్వారకపేట పంట పొలాలకు సాగు నీరందించేందుకు జాలు బంధం కాలువ ఏర్పాటు చేశారు. సుమారు 4కి.మీ నిడివితో 30 అడుగుల వెడల్పుతో ఉంటుందని నీటి పారుదల శాఖ అధికారులు చెప్పారు. నర్సంపేట మున్సిపాలిటీలో సర్వాపురం, ద్వారకపేట గ్రామాలు పట్టణంలో విలీనమయ్యాయి. స్థిరాస్తి వ్యాపారుల పుణ్యమాని పంట పొలాలు ఇళ్లు కాలనీలయ్యాయి. కాలువ కుడి వైపున గట్టును కలుపుకొని ఇళ్లు, భవనాలు నిర్మించారు. చివరకు కాలువ ఉనికి లేకుండా పోయింది. జాతీయ రహదారి ఆవలి వైపు కాలువను పూడ్చి కబ్జా చేయగా పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

**కాలువకు దారేదీ?**

నెక్కొండ: నెక్కొండ చెరువుకు వచ్చే ఎస్సారెస్పీ కాలువ పూర్తిగా ఆక్రమణకు గురికావడంతో కాలువ నీరు పంటపొలాల్లోకి వస్తోంది. దీంతో రైతులు తమ భూమిలో పండిస్తున్న పత్తి, మొక్కజొన్న పంటలు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. రైతులు పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనలు బేఖాతరు**

లక్నేపల్లి, రాములునాయక్‌తండా, మహేశ్వరం గ్రామాల రైతులకు సాగునీటి కోసం నిర్మించిన డీబీఎం-40 ఉపకాలువ పరిధిలో సుమారు 1200 ఎకరాల ఆయకట్టు ఉంది. నర్సంపేటకు చెందిన ఓ వైద్యుడు అనుమతుల్లేకుండా వేడుకల మందిరాన్ని ఉప కాలువ కలుపుకుని నిర్మిస్తున్నాడు. కాలువకు రెండు వైపులా 7 మీటర్ల చొప్పున ఎలాంటి నిర్మాణాలు చేయరాదు. వేడుకల మందిరం నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని డీఈఈ సంతోష్ తెలిపారు. చెరువు శిఖం భూమిలో..కత్ర్యాల ముసలమ్మ మర్రి వద్ద 39 గుంటల భూమి, కత్ర్యాల చెరువు శిఖం సుమారు 10 ఎకరాలకు పైగా కొంతమంది ఆక్రమించుకుని సాగు చేస్తున్నారు. ఉప్పరపల్లి క్రాస్ వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు.

# పడిపోతున్న మక్కల ధర

మహబూబాబాద్ : మక్కల ధర రైతన్నల్లో ఆందోళన కలిగిస్తోంది.. గత ఏడాది యాసంగిలో క్వింటాలుకు రూ.2,350 ధర పలకడంతో ఈసారి కూడా అదే ధర ఉంటుందని ఆశించిన అన్నదాతలు సాగు విస్తీర్ణాన్ని పెంచారు. తీరా చేతికొచ్చిన మక్కలను తీసుకొని మార్కెట్‌కు వెళ్తే పడిపోతున్న ధరలతో నిరాశకు గురవుతున్నారు. ధరలు మరింత తగ్గితే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను తెరిచి మద్దతు ధరతో కొనుగోలు చేయాల్సిందేనని అన్నదాతలు వాపోతున్నారు. లేకుంటే ప్రైవేటు వ్యాపారులు చెప్పిన ధరకు విక్రయించాల్సిన దయనీయ పరిస్థితులు ఎదురుకానున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారుల చేతుల్లో దోపిడీకి గురికాక ముందే అధికారులు తగిన చర్యలు చేపట్టాలని మొక్కజొన్న రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**సాగు తీరు ఇలా**

జిల్లాలో యాసంగిలో 45 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైనట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎకరాకు సుమారు 30 క్వింటాళ్ల చొప్పున దిగుబడి అంచనా కాగా ఈ లెక్కన 13,50,000 క్వింటాళ్ల దిగుబడి రానుంది.

**ఇదీ పరిస్థితి**

ప్రస్తుతం రోజూ కేసముద్రం మార్కెట్‌కు 4 నుంచి 9 వేల క్వింటాళు, మహబూబాబాద్ విపణికి 1500 నుంచి 3500 క్వింటాళ్ల చొప్పున మక్కలు వస్తున్నాయి. కేసముద్రంలో ఫిబ్రవరిలో క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2218 ధర పలకగా, మార్చి 28న రూ.2129 ధర ఉంది. ఏప్రిల్ 3న క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2078, 4వ తేదీన రూ.2066కు ఖరీదు చేశారు. బుధవారం మార్కెట్‌కు సెలవు కాగా గురువారం గరిష్ఠంగా రూ.2020 మాత్రమే పలికింది. కేసముద్రం మార్కెట్‌లో కనిష్ఠ మద్దతు ధరకన్నా తక్కువగా క్వింటాలుకు రూ. 1709 వచ్చింది. మహబూబాబాద్ మార్కెట్‌లోనూ ధర తగ్గుతోంది. విపణికి ఇంకా మక్కలు అధికంగా వస్తే ధర మరింత తగ్గే అవకాశాలున్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ లెక్కన రైతులు ప్రైవేటు వ్యాపారులు చేతుల్లో మోసపోకుండా ఉండేందుకు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని అన్నదాతలు కోరుతున్నారు.

**కారణం ఇదే**



తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం పెరగడమే ధరలు పడిపోవడానికి కారణమంటూ ఒక వ్యాపారి చెప్పారు. గత ఏడాది కేసముద్రం, మహబూబాబాద్ ప్రాంతం నుంచి ఇతర రాష్ట్రాలకే కాకుండా విదేశాలకు కూడా ఎగుమతి అవ్వడం వల్లనే అధిక ధరలు పలికాయని ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని అందువల్లనే పడిపోతున్నాయని చెబుతున్నారు.

**ఎన్నో ఆశలు పెట్టుకున్నాం- బొగ్గుల యాలాద్రి, కల్వల, కేసముద్రం**

రెండేళ్లుగా మొక్కజొన్న రైతులను కాపాడుతుంది. ఇతర పంటలు నష్టపోయినా మక్క పంటలో ఆశించిన దిగుబడులను పొందడంతో పాటు గిటుబాటు ధరను పొందాం. ప్రస్తుతం మార్కెట్‌లో రోజు రోజూకు ధర తగ్గుతుంది. గత ఏడాది కేసముద్రం మార్కెట్‌లో క్వింటాలుకు రూ.2300 ఉంటే ప్రస్తుతం రూ. 2 వేలు మాత్రమే ఉంది. మరింత తగ్గితే ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి మద్దతు ధరకు ఖరీదు చేయాలి.

**ఈసారి పెట్టుబడి వ్యయం పెరిగింది- రాంజీనాయక్, మూలస్తంభం తండా, కేసముద్రం**

మొక్కజొన్నకు చీడపీడల ఎక్కువగా ఉండటంతో పెట్టుబడి పెరిగింది. గతంలో ఎకరం సాగుకు రూ.20 వేలు అయితే ప్రస్తుతం పురుగు మందుల వినియోగం ఎక్కువ కావడంతో రూ.30 వేలు ఖర్చు చేశాం. క్వింటాకు రూ.2 వేల పైన ధర పలికితేనే గిట్టుబాటు అవుతుంది. మద్దతు ధరను పెంచి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

# పెరిగిన రేషన్ బియ్యం కోటా

నిజామాబాద్ : రేషన్ బియ్యం కోటా పెరిగింది. గతేడాది డిసెంబరు వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఆహార భద్రత కార్డులోని సభ్యుడి(యూనిట్)కి 10 కిలోల చొప్పున ఉచితంగా అందజేశారు. ఆహార భద్రత చట్టం ప్రకారం ఈ ఏడాది చివరి వరకు పొడిగించాలని కేంద్రం నిర్ణయం తీసుకున్నా రాష్ట్ర సర్కారు వాటా కేటాయించలేదు. ఫలితంగా గత మూడు నెలలు(జనవరి, ఫిబ్రవరి, మార్చి) కేంద్రం కోటా 5 కిలోల చొప్పున మాత్రమే పంపిణీ చేశారు. ఈ నెలలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద కిలో అందించేందుకు ముందుకు రావడంతో ఇరు సర్కారుల కోటా కలిపి యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున బియ్యం ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది.

**జిల్లాలో ఇలా**

జిల్లాలో ఇప్పటికే బియ్యం నిల్వలు రేషన్ దుకాణాలకు చేరగా పంపిణీ



కొనసాగుతోంది. అర్హులైన వారందరూ తీసుకుంటే ఈ నెల 15 కల్లా పంపిణీ ఆపేస్తారు. ఎవరైనా మిగిలి ఉంటే గడువు పెంచే అవకాశం ఉంటుంది.

**మే నుంచి బలవర్ధక..**

నిరుపేదలకు పోషక విలువలు అందించి వారిని ఆరోగ్యంగా ఉంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రజా పంపిణీ ద్వారా మే నుంచి బలవర్ధక బియ్యం(పోర్టిఫైడ్ బాయిల్డ్ రైస్) ఇవ్వాలని ఆదేశాలిచ్చింది. క్వింటా సాధారణ బియ్యానికి కిలో పోషకాలు మిళితం చేస్తారు. దీనిపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు.

**సక్రమంగా పంపిణీ చేయాలి చంద్రప్రకాశ్, డీసీఎస్‌వో**

బియ్యం పంపిణీ సక్రమంగా చేపట్టాలని డీలర్లకు ఆదేశాలు ఇచ్చాం. యూనిట్‌కు ఉచితంగా ఆరు కిలోలు ఇవ్వాలి. పేదలకు ఇచ్చే నిల్వలను ఎవరైనా పక్కదారి పట్టిస్తే చర్యలు తీసుకుంటాం. కార్డుదారులందరికీ సరకు అందుతుంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు. వచ్చే నెల నుంచి బలవర్ధక బియ్యం అందజేస్తాం.

# ఆహార శుద్ధి.. ఆర్థిక వృద్ధి!

బీర్కూర్ : గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించి ఆర్థిక చేయూతనందించే ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వ్యక్తిగతంగా, వివిధ సంఘాల ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమలకు మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ(ఎంఎఫ్‌పీఐ) ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకం ద్వారా రాయితీలు ప్రకటించింది.

**రూ. 10 వేల కోట్ల అంచనాతో**

గ్రామాల్లో ఆహార శుద్ధి పరిశ్రమలకు సంబంధించి ఈ పథకాన్ని ప్రకటించారు. దేశ వ్యాప్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి కనీసం 2 లక్షల యూనిట్ల ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో రూ.10 వేల కోట్ల అంచనాతో కేంద్రం బడ్జెట్‌ను ప్రకటించింది. ఈ పథకం ద్వారా గ్రామస్థాయిలో కొత్త పరిశ్రమల ఏర్పాటు .. ఇప్పటికే నడుపుతున్న వాటిని ఆధునికీకరించుకునేందుకు రాయితీలు అందిస్తారు.

జిల్లాలో 275 యూనిట్లను నెలకొల్పడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఇప్పటి వరకు 61 యూనిట్లు మంజూరు కాగా 26 మంది పరిశ్రమలను నెలకొల్పారు.

**ఉత్పత్తులు ఇవే...**

పిండిగిర్ని, బేకరి, నూనె, కారంపొడి తయారీ, పప్పు మిల్లు, రోటిమేకర్, చిరుధాన్యాల ప్రాసెసింగ్, మసాల దినుసులు, పిండి వంటలు, పుట్టగొడుగులు, పాల ఉత్పత్తులు, అల్లం వెల్లులి పేస్టు, పప్పులు



ఐస్‌క్రీమ్, బెల్లం, చిప్స్, సేమియా, అటుకులు, మరమరాలు తదితర యూనిట్ల ఏర్పాటుకు రాయితీలు అందిస్తారు.

పథకం ఇదీ.. పీఎంఎఫ్ఈ పథకం కింద బ్యాంకు ద్వారా 35 శాతం రాయితీతో రుణం అందిస్తారు.

వ్యక్తిగతంగా వ్యాపారం చేసుకునే వారు రూ.10 లక్షల వరకు రాయితీకి అర్హులు

స్వయం సహాయక (ఎస్‌హెచ్‌జీ), రైతు సంఘాలు (ఎఫ్‌పీవో) రైతు ఉత్పత్తిదారులు (ఎఫ్‌పీసీ), కోఆపరేటివ్ సంఘాల వారు గరిష్ఠంగా రూ. కోటి వరకు రాయితీకి అర్హులు.

వ్యాపారాభివృద్ధికి శిక్షణ..ఉత్పత్తుల మార్కెటింగ్, బ్రాండింగ్ అంశాలపై చేయూతనందిస్తారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

సాయన్న, డీఆర్‌డీఓ, కామారెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి ఉన్న సంఘ సభ్యులు ఈ పథకానికి అర్హులే. రాయితీతో కూడిన రుణం అందిస్తాం. ఆసక్తి ఉన్న వారు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సంప్రదించాలి.

# మేము వ్యాధులం.. తగ్గేదేలే..!

కరీంనగర్ : బతుకమ్మ.. దసరా.. పండుగస్తందని సంబురపడాల్న.. గీ జరాలు..తగ్గుత లేవని గోస పడాల్న..ఏం అర్థమయిత లేదంటుండ్రు జిల్లా జనాలు.. వానలు పోయి.. సలికాలం రాకముందే గిట్లుంటే ఇక సలికాలం ఎట్ల మరి? అని వణుకుతున్నారు.. పోయిన ముణ్ణెళ్ల నుంచి.. ఆడ..మగ..ముసలోళ్లు.. పిల్లగాండ్లు అనే తేడా లేకుండా దగ్గు, పడిశెము, జరాలు ఇంటి సుట్టు తిరుగుతున్నాయి.. పగలు ఎండ, సాయంత్రం ఉక్కపోత, తెల్లవారుజామున సలితో శరీరాలు తట్టుకోలేకపోతున్నాయి. వారం రోజులుగా వసపడని పరిస్థితి ఉంది.. ఇక డెంగీ.. వైరల్ మాములు జరాలతో ఆసుపత్రుల పాలవుతున్న తీరుపై కథనం ఇది..

నా పేరు తెలియనోళ్లు లేరు..

నా పేరు తెలియనోళ్లు ఉండరు.. పిల్లలు.. పెద్దోళ్లందరిని నేను 'మునుము' బట్టి దవాఖానాల చుట్టూ తిప్పుతున్న.. అందుకే నన్ను జ్వరం అని పిలుస్తారు. రెండేళ్ల కిందట కరోనా సమయంలో.. నేను వస్తున్న అంటేనే ఉరుకబుచ్చుకున్నారు. ప్రపంచమంతా పగబట్టి నా మీద సూదులు గుచ్చి పడుకోబెట్టిండ్రు.. ఇక పోనీయి అని ఇప్పుడు మళ్లీ సురువు జేసిన.. వైరల్ ఇన్‌ఫెక్షన్ వంటి నా సోపతోళ్లు మళ్లీ నన్ను లేపిండ్రు.. ఇగ మనుషుల వెంట పడి లేవకుంటజేస్తున్న.. మా సుట్టపోళ్లు వాళ్లె దోమలు కూడా వచ్చి మేము కుట్టి వస్తం నువ్వు మాత్రం జనం వెంబడి పడమంటుండ్రు.. వాళ్ల సహాయంతో ప్లేట్‌లెట్స్ తగ్గేలా చేసి దవాఖానాకు పంపి లక్షలు ఖర్చు పెట్టిస్తున్న.. వైరల్ సోపాతోళ్లతో కలిసి తిరుగుతున్నా.. నాకుతోడు మా సోదరులు పడిశెం(జలుబు) దగ్గు కలిసి మనుషుల గోసపుచ్చుకుంటున్నాం. మా శత్రువులు(వైద్యులు) వెంటపడి మనుషులకు మందులు ఇచ్చి మామూలు వాళ్లను జేస్తుండ్రు. ఊపిరితిత్తులకు చొచ్చుకుపోతున్నా.. వైద్యులు ఇడిసి పెడతలేరు.. నాకు గాలి ఎండ కూడా గట్టి సపోటు ఉన్నది అందుకే నేను చెలరేగిపోతున్నా. అయినా నా మీద డాక్టర్లు కక్షగట్టి సూదులు ఇస్తుండ్రు.

ఊపిరి తీసుకోనివ్వను..నన్ను జలుబు అంటారు.. ఇప్పుడు వాతావరణ పరిస్థితులు నాకు సహకరిస్తున్నాయి. మా జ్వరం పెద్దన్నకు సపోర్టు చేస్తున్నా.. గీ వైరల్ సోపతోళ్లు గాలి ద్వారా ఊపిరితిత్తులలోకి సొచ్చుకుపోయి 'సైనైటిస్' ఇన్‌ఫెక్షన్‌తో ఇబ్బంది పెడుతున్నా.. ఛాతిల గుర్రుగుర్రుమనిపిస్తున్న.. పిల్లికూతలు తెప్పిస్తున్న.. దగ్గు.. ఆయాసం వచ్చేలా చేస్తున్న ఊపిరితిత్తుల కవాటాలలో వైరల్‌తో కలుస్తున్న.. అందుకే జనం గోసపడుతుండ్రు.. కొందరికి తుమ్ములతో సతమతం చేస్తున్నా. ముక్కు ద్వారా ఊపిరి తీసుకోనివ్వడంలేదు. నిద్ర పోకుండా చేస్తున్నా.. నా గాలి పీల్చితే చాలు మరొకరికి వ్యాపిస్తున్నా. పిల్లలో నా ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నాతో ఇగ వసపడని వాళ్లు.. వైద్యులను కలిసి మందు గోలీలు వేసుకుంటున్నారు. వేడి నీరు తాగుతూ నన్ను అడ్డుకుం టున్నారు. అయినా నేను కొత్త వారిని వెతుక్కుంటూ ముందుకెళ్తున్నా..

వీడని దగ్గు..నేను దగ్గును. నా పని నేను చేస్తుంటే.. దగ్గుతున్నాడని హేళన చేస్తున్నారు.. నేను అందరికీ తెలుసు కదా కరోనా కాలం నన్ను చూసి ఉసురు పుచ్చుకున్నారు. మందులు ఇచ్చి పండబెట్టిండ్రు.. ఇగ ఇప్పుడు మా బంధువు వైరస్‌తో కలిసి నేను ఊపిరితిత్తుల్లోకి వెళ్లి లోపల పొరలను కరాబు చేస్తున్న.. నేను సొచ్చినంటే వారం, పది రోజులైనా బయటకు రాను.. రక్తపోటు..షుగర్ ఉన్న వాళ్లు, గర్భిణులు, చిన్న పిల్లలు, మూత్ర సంబంధ వ్యాధి ఉన్న సోపతోళ్లకైతే నేను బెల్లం లెక్కనే.. వెంటనే కలిసిపోయి మరింత ఇబ్బందిపడుతా.. చల్లని నీరు, ఆహార పదార్థాలు నన్ను బలోపేతం చేస్తాయి. కొందరు పరిశుభ్రత పాటిస్తూ.. నన్ను దరి చేరనివ్వడం లేదు. గోలీలు, టానిక్‌లు, సూదులు వాడి నన్ను మెడలుబట్టి బయటకు పంపుతుండ్రు. జాగ్రత్తలతో దూరం కొడుతుండ్రు.

మాస్కు తప్పనిసరి

ఇప్పుడు వస్తున్నవి వైరల్ జ్వరాలు, ఇంట్లో ఒకరికి వస్తే మరొకరికి అంటుకుంటుంది. తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. రెండు, మూడు రోజులు జ్వరం, జలుబు, దగ్గు తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలి. ఆయాసం, దగ్గినప్పుడు తెమడ, రక్తపు చారాలు కనబడితే తీవ్రంగా పరిగణించాలి. డెంగీ జ్వరాలు వేరు. వైరల్ ఎక్కువగా ఉన్నాయి. తగ్గడానికి కనీసం వారం పడుతుంది.

డాక్టర్ ఎం.విజయ్‌మోహన్‌రెడ్డి, సీనియర్ ఫిజీషియన్

రోజుకు 200 మంది పిల్లలు..

కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి రోజుకు 200 మంది పిల్లలు జ్వరాలతో ఆసుపత్రికి వస్తున్నారు. ఇప్పుడు 50 మందికి పైగా ఇన్‌పేషంట్లుగా ఉన్నారు. వైరల్, ఫ్లూ, జ్వరాలు ఉన్నాయి. తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్స్ తగ్గుతున్నాయి. డెంగీ నిర్ధారణ కావడం లేదు. ఊపిరితిత్తుల సమస్య ఉంది. వైద్యం అందిస్తున్నాం.

డాక్టర్ అజయ్, సీనియర్ పిల్లల వైద్యులు, ప్రభుత్వాసుపత్రి

శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాంజిల్లాలో వైరల్ జ్వరాలు పెరిగాయి. గత నెల 13 నుంచి ప్రతి ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో ప్రతి రోజు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వర పీడితులను గుర్తిస్తున్నాం. అవసరమైన వారికి మందులు ఇస్తున్నాం. ఇది నిరంతర ప్రక్రియ. ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.డాక్టర్ కె.లలితాదేవి, డీఎంహెచ్‌వో

## వారానికో కృత్యం.. సామర్థ్యాల పెంపే లక్ష్యం

అచ్చంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు విద్యాశాఖ దృష్టి సారించింది. ప్రాథమిక స్థాయిలో తొలిమెట్టు, ఉన్నత పాఠశాలల్లో 6–9 తరగతుల విద్యార్థులకు ఉన్నతి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతను పెంచేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఇంటి వద్ద పాఠ్యాంశాలను సాధన చేసేందుకు సాంకేతికతను వినియోగించుకొని ప్రతిభను చాటేలా చొరవ చూపుతున్నారు. 3–10 తరగతి విద్యార్థుల కోసం 'ఇంటింటా చదువుల పంట' పేరుతో విద్యార్థులు ఇంటి వద్ద సాధన చేసేందుకు ప్రత్యేక అభ్యాసాలను రూపొందించారు. గతేడాది మంచి ఫలితాలు రావడంతో ఈ ఏడాది కూడా పథకాన్ని కొనసాగించేందుకు చర్యలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో 3–10 తరగతి చదువుతున్న విద్యార్థులు 3,25,396 మందికి ప్రయోజనం చేకూరనుంది.విద్యార్థుల నమోదుపై దృష్టి.. : విద్యార్థుల వాట్సాప్ నంబర్లను తరగతుల వారీగా ఉపాధ్యాయులు ప్రత్యేక రిజిస్టర్లలో నమోదు చేస్తున్నారు. గతంలో ఒక చరవాణి నంబరు ఒకే విద్యార్థికి ఉండాలన్న నిబంధన ఉండగా ప్రస్తుతం ఎక్కువ మందికి అవకాశం కల్పించారు. ఒకే ఇంట్లో ఇద్దరు ముగ్గురు పిల్లలు ఉన్నా ఒకే నంబరుతో ఉపయోగించేందుకు అనుమతి ఇచ్చారు. పాఠశాల యూడైస్ కోడ్ ఆధారంగా తరగతుల వారీగా ఇంటింటా చదువుల పంట యాప్‌లో పేర్లు నమోదు చేయిస్తున్నారు. ప్రతి చరవాణికి లింక్ ద్వారా వాట్సాప్‌లో వర్క్‌షీట్లను పంపిస్తున్నారు. వాటిని మళ్లీ శుక్రవారంలోగా పూర్తి చేసేలా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలి. ప్రతి విద్యార్థి ఇంటి వద్ద వర్క్‌షీట్లను సాధన చేసేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం)లో ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వర్క్‌షీట్లను సాధన చేసి వాట్సాప్‌లో మళ్లీ ఉపాధ్యాయులకు పంపిస్తే వారు సరిచేసి విద్యార్థులకు సలహాలు, సూచనలు అందజేస్తారని నాగర్‌కర్నూల్ డీఈవో డా.గోవిందరాజులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

# ఎటువైపో..యువతరంగం..!



నల్గొండ : ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతున్న ప్రధాన పార్టీలన్నీ కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న వారితో పాటూ 30 ఏళ్ల యువ ఓటర్లపై దృష్టిపెట్టాయి. వారిని ఆకర్షించేందుకు క్షేత్రస్థాయిలో ప్రయత్నాలు ప్రారంభించాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో 18 నుంచి 30 ఏళ్ల వయసు గల ఓటర్ల వాటా సుమారు 40 శాతంగా ఉంది. రానున్న ఎన్నికల్లో వీరు కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. వీరి మద్దతు కూడగట్టేందుకు అధికార భారాస, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు ఇప్పుటి నుంచే ప్రణాళికలను రూపొందిస్తున్నాయి. భారాస ఇప్పటికే క్షేత్రస్థాయిలో వంద మంది ఓటర్లకి ఒకరి చొప్పున ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. వీరు వారి పరిధిలో కొత్తగా నమోదైన ఓటర్లు, 30 ఏళ్ల వయసు వారి వివరాలు సేకరిస్తున్నారు. వారికి కావాల్సిన పరికరాలు, హామీలు ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. ఎక్కువ మంది ఓటర్లున్న నాయకులకు త్వరలోనే తాయిలాలు అందజేస్తామని హామీ ఇస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో 18 నుంచి 30 ఏళ్ల వయసు గల ఓటర్లంతా తమకు మద్దతుగా ఉంటారని కాంగ్రెస్ బలంగా నమ్ముతోంది. అన్ని నియోజకవర్గాల్లో టిక్కెట్ ఆశిస్తున్న నేతలు, సీనియర్ నాయకులు ఈ వర్గం ఓటర్ల వివరాలను సేకరించాలని క్షేత్రస్థాయి నాయకులను ఆదేశించారు.

చిరునామాల సేకరణ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 18 నుంచి 30 ఏళ్ల వయసు గల ఓటర్లంతా చదువు, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. వీరి చిరునామాల సేకరణ ప్రక్రియను ఇప్పటికే ప్రధాన పార్టీలు ప్రారంభించాయి. ఉదాహరణకు మునుగోడులో మొత్తం 2.48 లక్షల మంది ఓటర్లుండగా...వీరిలో 18 నుంచి 30 ఏళ్లలోపు వయసు గల ఓటర్లు 63,159 మంది ఉన్నారు. వీరిలో సుమారు 40 వేల మందికిపైగా హైదరాబాద్, గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీ ప్రాంతాలకు వలస వెళ్లారు. గతేడాది జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపోటముల్లోనూ వీరే కీలక పాత్ర పోషించారు. దీంతో ప్రధాన పార్టీలయిన భారాస, కాంగ్రెస్, భాజపా ఎన్నికలప్పుడు వీరందరినీ తీసుకురావడానికి ఇప్పటికే కొంత మందికి బాధ్యతలు అప్పగించింది. ఇలా ప్రతి నియోజకవర్గంలోన యువ ఓటర్లు ఎంత మంది? వలస ఓటర్లలో వీరు ఎంత శాతం అనేది లెక్కలు వేసుకుంటున్నారు.

# ముమ్మరంగా అనుసంధాన కాలువ పనులు



ధర్మారం : ధర్మారం మండలం నందిమేడారం రిజర్వాయరు నుంచి ఎండపల్లి, వెల్గటూరు మండలాలకు సాగునీరందించే అనుసంధాన కాలువ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గతేడాది నవంబరు 30న మంత్రి కొప్పుల ఈశ్వర్ కాలువ తవ్వకం పనులను ప్రారంభించారు. రిజర్వాయరు నుంచి ధర్మారం శివారులోని ఎస్సారెస్పీ డి83బి కాలువకు అనుసంధానించడానికి రూ.12.40 కోట్లతో చేపట్టిన పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ప్రస్తుతం రిజర్వాయరు కట్ట వద్ద రెగ్యులేటర్, అవసరమున్న చోట కల్వర్టుల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఆరు రోజులుగా ఎస్సారెస్పీ కాలువలోకి కలిపే చోట తవ్వుతున్నారు. దీంతో పనులు పూర్తయ్యేవరకు ధర్మారం గ్రామ శివారుతో పాటు ఎండపల్లి, వెల్గటూరు మండలాలకు సాగునీటి సరఫరా నిలిపివేశారు. మూడు రోజుల్లో మట్టి పనులు పూర్తయ్యాక సరఫరా పునరుద్ధరిస్తామని ఎస్సారెస్పీ డీఈఈ కుమార్ తెలిపారు. అనుసంధాన కాలువలో 110 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా రూపకల్పన చేశారు. ఈ కాలువతో ధర్మారం, ఎండపల్లి, వెల్గటూరు మండలాల్లోని 10 వేల ఎకరాల ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరందనుంది. ఎస్సారెస్పీతో సంబంధం లేకుండా నందిమేడారం రిజర్వాయరు నుంచే నిరంతరాయంగా నీరందించేందుకు వీలుంటుంది. తవ్వకం పనులు పూర్తయ్యాక సాగు నీరందిస్తామని, వేసవిలో కాలువకు లైనింగ్ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కాలువ తవ్వుతున్న చోట మిషన్ భగీరథ గ్రిడ్ లైన్లుండగా.. కాలువ తవ్వకం కోసం వాటిని తొలగించారు. దీంతో ధర్మారం మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. పునరుద్ధరణకు మరో పక్షం రోజులు పట్టే ఆస్కారముంది.

సాగునీటి సరఫరా నిలిపివేతపై రైతుల ఆవేదన

ఎస్సారెస్పీ డి83బి కాలువకు సాగునీటి సరఫరా నిలిపివేతపై నందిమేడారం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పంట పొలాలు ఎండుతున్నాయంటూ పనులు చేస్తున్న ప్రదేశానికి వెళ్లి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా పనులు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఏఈ నరేశ్‌ను సంప్రదించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నందిమేడారం వరకు నీరందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎండపల్లి, వెల్గటూరు మండలాలకు వారంలోగా సరఫరా మొదలవుతుందన్నారు.

# ప్రోత్సాహం కరవు.. సాగు బరువు



సిరిసిల్ల : జిల్లా ప్రజల కూరగాయల అవసరాలకు, సాగుకు భారీ వ్యత్యాసం ఉంది. చాలా వరకు దిగుమతి చేసుకోవడంతోనే ఇక్కడి అవసరాలు తీరుతున్నాయి. కొన్నేళ్లుగా కూరగాయల సాగుకు ఉద్యానవనశాఖ నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు అందడం లేదు. ఫలితంగా కూరగాయలు సాగు చేసే రైతులు వరి, ఇతర ఆరు తడి పంటలవైపు మళ్లారు. జాతీయ పోషకాహార సంస్థ అంచనా ప్రకారం ప్రతి మనిషి రోజుకు 300 గ్రాముల కూరగాయలు తీసుకోవాలి. అప్పుడే ఆరోగ్య సమతుల్యత సాధ్యపడుతుంది. జిల్లా జనాభాకు, అవసరాలకు ప్రతి సీజన్‌లో 2,600 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు సాగు చేయాలి. ప్రస్తుతం జిల్లాలో 542 ఎకరాల్లో సాగు అవుతున్నాయి. అంటే అవసరంలో 20 శాతం మాత్రమే. గతేడాది 610 ఎకరాలు సాగయ్యాయి. అందులోనూ అన్ని రకాల పంటలు వేయడం లేదు. జిల్లా జనాభాకు ఏటా 58,978 మెట్రిక్ టన్నుల కూరగాయలు ఉత్పత్తి చేయాలి. కానీ 12 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్నట్లు ఉద్యానవనశాఖ లెక్కలు చెబుతున్నాయి. స్థానికంగా లభ్యత లేకపోవడమే కూరగాయల ధరల హెచ్చుతగ్గులకు కారణంగా చెబుతున్నారు. దీంతో చాలా మంది కొన్ని రకాల కూరలనే ఎక్కువగా తింటుంటారు. దీంతో పోషకాల సమతుల్యత లోపిస్తోంది. ఇతర జిల్లాల నుంచే దిగుమతి చేసుకోవడంతో చాలా వరకు అవసరాలు తీరుతున్నాయి.

ఇతర జిల్లాల నుంచి దిగుమతితో...జిల్లా ప్రజల అవసరాలకు నిత్యం మూడు వేల క్వింటాళ్ల కూరగాయలు అవసరం. ప్రస్తుతం సిరిసిల్ల, వేములవాడ మార్కెట్‌లకు వెయ్యి క్వింటాళ్లలోపు మాత్రమే వస్తున్నాయి. దీంతో సిద్దిపేట, కామారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని అడ్తి వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలో వేములవాడ, బోయినపల్లి, ఇల్లంతకుంట, కోనరావుపేట మండలాల్లోని గ్రామాల్లో కూరగాయల సాగు ఎక్కువగా ఉంటుంది. ఇతర జిల్లాల నుంచి వచ్చే దిగుబడులు, వాటి ధరలను తట్టుకునే పరిస్థితి జిల్లా రైతులకు లేదు. దీనికి తోడు ప్రభుత్వం కూరగాయల సాగుకు ప్రోత్సాహకాలు నిలిపివేసింది.

సాగు పెంచడానికి కార్యాచరణ

జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. ప్రస్తుతం వానాకాలంలో సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ యాసంగిలో రెండింతలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఆ దిశగా గ్రామాల వారీగా రైతులను చైతన్యం చేస్తున్నాం. పందిరి సాగులో కూరగాయలు పండించిన రైతులకు లాభాలు వస్తున్నాయి. ఆయిల్‌పాం, మామిడి వంటి తోటల్లో కూరగాయలు అంతర పంటలుగా సాగు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

జ్యోతి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

నాలుగేళ్లుగా రాయితీ ఊసేలేదు

నాకున్న పదెకరాల్లో నాలుగు ఎకరాలు పత్తి సాగు చేస్తున్నాను. మిగతా విస్తీర్ణంలో వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నాను. గతంలో విత్తనాలు మొదలు బిందుసేద్యం, మల్చింగ్ వంటివి రాయితీగా అందేవి. సాగు చేసిన కూరగాయలు మార్కెట్‌కు తీసుకెళ్తే ధర గిట్టుబాటు కావడం లేదు. నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు అందడం లేదు. ప్రస్తుతం కొద్ది మొత్తంలో పందిరి సాగులో తీగజాతి కూరగాయలు సాగు చేస్తున్నాను.కమలాకర్‌రెడ్డి, రామన్నపేట, బోయినపల్లి మండలంపూర్తిగా వరి సాగు చేస్తున్నా..

నాకున్న 11 ఎకరాల్లో ప్రతి సీజన్‌లో సగానికి పైగా కూరగాయలు సాగు చేసేది. ఇంటిల్లిపాది నిత్యం కష్టానికి తోడు ప్రభుత్వ ప్రోత్సాహంతో ధరలు గిట్టుబాటు కాకున్నా పెద్దగా ఇబ్బందులేమీ ఉండేది కాదు. ప్రభుత్వం కూరగాయల సాగుకు ప్రోత్సాహకాలు పూర్తిగా ఇవ్వడం లేదు. దీంతో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, పెట్టుబడులకు తగిన దిగుబడులు రాకపోవడం, మార్కెట్‌లో ధర లేకపోవడం తదితర కారణాలతో వరుసగా నష్టాలను చవిచూశాం. చేసేది లేక రెండేళ్లుగా పూర్తిగా వరి సాగు చేస్తున్నాను.

# మక్తల్‌లో ఆధార్ అవస్థలు

మక్తల్ : జిల్లాలో ప్రధాన ప్రాంతం మక్తల్. పట్టణంతోపాటు పలు గ్రామాల ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. ఈ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ఆధార్ కేంద్రాలు మూతపడటంతో పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంపీడీవో, పురపాలిక, బీఎస్ఎన్ఎల్, తహసీల్దార్, తపాలా కార్యాలయాల వద్ద గతంలో ఆధార్ నమోదు కోసం ప్రభుత్వం కేంద్రాలను ఏర్పాటు చేసింది. గత 45 రోజులుగా ఇవి పనిచేయడం లేదు. మక్తల్ మండలంలో 72,028 మంది నివసిస్తున్నారు. అన్ని అవసరాలకు ఆధార్ తప్పనిసరి కావడంతో ప్రజల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. కేంద్రాల్లో సిబ్బంది నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. నమోదు సమయంలో 30 తప్పులకు మించి చేస్తే ఆధార్ సెంటర్ ఐడీ బ్లాక్ అవుతుందని అధికారులు తెలిపారు. అలా ఒక్కొక్కటీ మూతపడ్డాయి. మూడు నెలల వరకు కొత్త ఐడీ ఇవ్వడం లేదు. కొన్ని సెంటర్ల గడువు మూడు నెలలు దాటినా ఆధార్ కేంద్రం ఐడీ పునరుద్ధరించలేదు. ఆధార్‌లో సవరణలు, కొత్తగా కార్డులు పొందేందుకు ప్రతి నిత్యం వివిధ గ్రామాల ప్రజలు, పట్టణవాసులు కార్యాలయాలకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. మరికొందరైతే జిల్లా కేంద్రానికి, ఇతర మండలాలకు వెళ్లి అనుసంధానం, సవరణలు




చేసుకుంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

అన్నింటికీ అదే ఆధారం అంగన్వాడీలు, పాఠశాలల్లో చేరాలన్నా, బ్యాంకు ఖాతా తెరవాలన్నా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలన్నా ఆధార్ అవసరం. రేషన్‌కార్డు, ఆయుష్మాన్‌భారత్... ఇలా ప్రతిదానికీ ఆధార్ అనుసంధానం తప్పనిసరి. కేంద్రాలు మూతపడి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా కేంద్రానికి వెళ్లి సవరణలు చేసుకోవడం కష్టసాధ్యంగా మారింది. ఒకరోజు టోకెన్లు జారీ చేస్తారు. మరో నాలుగైదు రోజుల తర్వాత వెళ్తే సవరణలు చేస్తున్నారు. మరికొన్ని సందర్భాల్లో కొర్రీలు వేస్తున్నారు. చిన్నపాటి సవరణలకు సైతం వందల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

నెలరోజులుగా తిరుగుతున్నాం

కృష్ణా మండలం కున్సి గ్రామానికి చెందిన జాహ్నవికి మక్తల్ పట్టణానికి చెందిన చరణ్‌తో వివాహమయ్యింది. ఆధార్‌లో తల్లిదండ్రుల పేరుకు బదులు భర్త పేరు నమోదు చేసేందుకు గత నెల రోజుల నుంచి తిరుగుతున్నారు. ఎన్నిసార్లు తిరిగినా కేంద్రాలు ఎప్పుడు తెరుస్తారో చెప్పడం లేదు. సొంత పనులు వదులుకొని మూడుసార్లు తిరిగినా ఆధార్‌లో సవరణలు పూర్తి కావడం లేదని మక్తల్‌కు చెందిన కుర్వ వెంకటేష్ వాపోయారు. తనలాగే వందలమంది వచ్చిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఉన్నతాధికారులకు నివేదించాం– రామ్మోహన్, మీసేవ కేంద్రాల డీఎం, నారాయణపేట.మక్తల్‌లో మూతపడ్డ ఆధార్ కేంద్రాల విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. కొత్త ఐడీలు ఏర్పాటు చేసే విషయం కోర్టు పరిధిలో ఉంది. ఉన్నతాధికారులతో మాట్లాడి పాత ఐడీలను పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నాం.

# మక్క రైతుకు దిక్కెవరు?

మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న సాగు చేసిన ప్రతి రైతు పరిస్థితి ఇలానే ఉంది. ఈ వానాకాలం సీజన్‌లో 1.35 లక్షల ఎకరాల్లో మక్కలను సాగు చేస్తారని అధికారులు అంచనా వేయగా 1.01 లక్షల ఎకరాల్లో వేశారు. ఈ సారి ఆశించిన స్థాయిలో వర్షాలు పడక దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. సాధారణంగా ఎకరాకు గ్రేడ్‌ను బట్టి 15–25 క్వింటాళ్ల వరకు దిగుబడి ఉంటుంది. వర్షాభావ పరిస్థితులున్న చోట ఎకరాకు 7–10 క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వస్తోంది. దీంతో రైతులు పొలాల దగ్గరే పంటను ఆరబెట్టుకుని తూర్పార పడుతున్నారు. తీరా విక్రయిద్దామంటే ప్రభుత్వం కొనుగోళ్ల కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. వ్యవసాయ మార్కెట్ యార్డులకు తీసుకెళ్లి అక్కడ ఆరిన తర్వాత ప్రైవేటు వ్యాపారులకు పంటను తెగనమ్ముకుంటున్నారు. గ్రేడ్, తేమ శాతాన్ని బట్టి వ్యాపారుల ధరను అడుగుతున్నారు. ప్రభుత్వం మొక్కజొన్నకు మద్దతు ధర ప్రకటించినా కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో బయటనే అమ్ముకోవాల్సి వస్తోంది.

కొనుగోలు కేంద్రాలపై అనిశ్చితి..

ప్రభుత్వం మొక్కజొన్నకు 2023–24 మద్దతు ధర రూ.2,090గా నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. అధికారులు ప్రతిపాదనలు పంపించినా కేంద్రాల ఏర్పాటుపై అనిశ్చితి నెలకొంది. గతంలో రైతులు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధరకు పంటను విక్రయించేవాళ్లు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు వ్యవసాయ మార్కెట్లకు తీసుకెళ్లి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మార్కెట్ యార్డులకు వస్తే పంట ఆర పెట్టుకోవాడానికి మూడు, నాలుగు రోజులు పడుతోంది. రాత్రివేళల్లో మార్కెట్ యార్డులోనే పంట కోసం కాపు కాయాల్సిందే. ఒకవైపు మార్కెట్‌లో కనీస వసతులు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరికొందరు రైతులు వీటిని కోళ్లఫారాలకు విక్రయిస్తున్నారు. మొక్కజొన్న కోళ్లకు దాణాగా ఉపయోగపడుతుంది. కొన్ని గ్రామాల్లో దళారులు తిష్టవేసి రైతుల దగ్గర నుంచి ఒప్పందాలు చేసుకుని కోళ్ల ఫారాల యజమానులకు తరలిస్తున్నారు. ఒక్కోసారి ధర బాగా పలుకుతున్నా.. కొన్ని సందర్భాల్లో తక్కువ ధర తీసుకుంటున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం చిన్నదార్‌పల్లికి చెందిన సుదర్శన్ ఐదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ట్రాక్టర్, కూలీలు, విత్తనాలు, ఎరువులు మొత్తం కలిపి రూ.లక్ష వరకు సాగుకు ఖర్చు చేశారు. వర్షాభావ పరిస్థితులతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. ఎకరాకు 15 క్వింటాళ్లకుగాను 7 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. మొక్కజొన్న పచ్చిగా ఉండటంతో ఆర పెట్టుకోవడానికి మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చారు. దిగుబడి తక్కువగా రావడంతో పెట్టుబడి కూడా రాని పరిస్థితి.

మార్కెట్‌లో ధర తక్కువగా ఉంటే..

–నర్సింగ్‌రావు, డీఎం, మార్క్‌ఫెడ్, మహబూబ్‌నగర్

ప్రభుత్వం మక్కలకు క్వింటాకు రూ.2090 మద్దతు ప్రకటించింది. ప్రస్తుతం బయటి మార్కెట్‌లో నాణ్యమైన పంటకు రూ.2,200 వరకు ధర పలుకుతోంది. ఎంఎస్‌పీ ధర కంటే తక్కువగా ఉంటే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

# రూ. 50వేలు దాటితే ఇబ్బందే..!

ఖమ్మం : శాసనసభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ (ప్రవర్తన నియమావళి) అమల్లోకి వచ్చింది. డిసెంబర్ 5 వరకు కోడ్ అమలులో ఉంటుంది. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాన్ని నిలువరించేందుకు ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటోంది. అధికార యంత్రాంగమంతా ఎన్నికల సంఘం ఆదేశాలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది.

ఆధారాలు చూపితే..

సాధారణ వ్యక్తులు వ్యాపార నిమిత్తం, ఆసుపత్రి, వ్యవసాయ అవసరాలు, పెళ్లిళ్ల షాపింగ్, ఇతర ఖర్చులకు రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తుంటే ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో తెలిపే పత్రాలు చూపాలి. బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసిన రసీదు, ఏటీఎం నుంచి ఉపసంహరించుకున్న స్లిప్, ఇతరుల నుంచి అప్పుగా తీసుకుంటే అందుకు సంబంధించిన పత్రాన్ని అధికారులకు చూపాల్సి ఉంటుంది. రాజకీయేతర వ్యక్తులు రూ.10 లక్షల వరకు నగదు వెంట తీసుకెళ్లినా తగిన పత్రాలు చూపితే అధికారులు వదిలేస్తారు. అన్ని పత్రాలు చూపినా రూ.10 లక్షలు దాటితే ఆదాయపన్ను శాఖ అధికారులకు సమాచారం అందిస్తారు. అప్పుడు ఆదాయపన్ను శాఖ అధికారులు కోరిన పత్రాలు చూపాలి. బ్యాంకుల్లో పెద్దమొత్తంలో నగదు విత్‌డ్రా పైనా నిఘా ఉంటుంది.

వారంలో తిరిగిచ్చేస్తారు..!

చెక్‌పోస్టుల వద్ద, ఇతర తనిఖీల్లో పట్టుబడ్డ సొమ్మును జిల్లా ఖజానా అధికారికి అప్పగిస్తారు. పట్టుబడిన నగదుకు సంబంధించిన పత్రాలు వెంటనే చూపకపోయినా ఆతర్వాత జిల్లాస్థాయిలో ఏర్పాటైన అధికారుల కమిటీకి సమర్పించి.. నగదు తిరిగి పొందవచ్చు. జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కన్వీనర్‌గా జడ్పీ సీఈఓ, డీటీఓ (జిల్లా ఖజానా అధికారి) సభ్యులుగా కమిటీ ఏర్పాటైంది. కలెక్టరేట్‌లో ఈకమి



టీ అందుబాటులో ఉంటుంది. పట్టుబడిన నగదుకు సంబంధించిన ఆధారాలు, సరైన పత్రాలు సమర్పించిన తర్వాత కమిటీ పరిశీలించి విశ్వసిస్తే సదరు సొమ్మును తిరిగిచ్చేస్తారు. ఈ ప్రక్రియ వారంలో పూర్తి కావాల్సి ఉంటుంది. వారం దాటితే సీజ్ చేసిన నగదును ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతే ఇస్తారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేస్తే స్వాధీనపరచుకున్న నగదును కోర్టుకు అప్పగిస్తారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కోర్టుకు తగిన ఆధారాలు సమర్పించి నగదు విడిపించుకోవాల్సి ఉంటుంది.

అన్నిచోట్లా నిఘా..ఖమ్మం జిల్లాలోని 15 ప్రాంతాల్లో ఎస్ఎస్‌టీ (స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్) చెక్‌పోస్టులు, అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో మరో 12 చెక్‌పోస్టులు, భద్రాద్రి జిల్లాలో 26 చోట్ల ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టులు, అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో మరో పదకొండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గానికి 3 చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఎస్ఎస్‌టీ బృందాలను నియమించారు. ఈ బృందాలు షిఫ్ట్ విధానంలో రోజుకు 24 గంటలు విధులు నిర్వర్తిస్తాయి. చెక్‌పోస్టులు సహా ఇతర ప్రదేశాల్లోనూ సంచరిస్తుంటాయి. వీరితోపాటు ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమలు బృందాలు తిరుగుతుంటాయి. పోలీసు, రెవెన్యూ సహా వివిధ శాఖల అధికారులు ఆయా బృందాల్లో విధులు నిర్వర్తిస్తుంటారు. వీరితోపాటు పోలీసు నిఘా కొనసాగుతుంటుంది. చెక్‌పోస్టులు సహా ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీసులు సహా అధికారుల బృందాలకు అందే రహస్య సమాచారం ఆధారంగానూ వాహనాలతోపాటు గోదాములు, ఇళ్లు తనిఖీ చేసే అవకాశముంది.

# ఓట్ల పండగ.. ఏర్పాట్లు ఘనంగా..

ఖమ్మం : శాసనసభ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలుచేయటంతోపాటు గతం కన్నా ఈసారి పోలింగ్ శాతం ఎక్కువ నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గాల సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అధికారులు తలమునకలు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేలా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వేలెన్సు, వీడియో సర్వేలెన్సు, వీడియో ఫ్లయింగ్ స్క్వాడ్స్, నోడల్ అధికారులు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలయ్యారు. కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక అల, పోలీసు బాసులు విష్ణు వారియర్, వినీత్ దిశానిర్దేశం చేస్తున్నారు.వసతుల కల్పనపై..పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు. మంచినీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, ర్యాంపులు, వీల్‌ఛైర్లు అందుబాటులో ఉంచనున్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువ నమోదైన నియోజకవర్గాలపై ఈసారి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఈసారి 63, భద్రాద్రి జిల్లాలో మూడు పోలింగ్ కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటర్లు తమ ఓటుహక్కు వివరాలు, ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకునేలా వెసులుబాటు కల్పిస్తున్నారు.పకడ్బందీగా కోడ్ అమలుఎన్నికల షెడ్యూల్ విడుదలైన తొలి 24 గంటల్లో ప్రభుత్వ భవనాలు, ఆస్తులపై ఉన్న రాజకీయ ప్రకటనలు, వాల్ రైటింగ్, నేతల చిత్రాలు, హోర్డింగులను తొలగించా రు. బహిరంగ ప్రదేశాల్లో నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రభుత్వ స్థలాలు, జనసంచారం కలిగిన ప్రాంతాలు, రహదారులకు రెండువైపులా, ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు, హోర్డింగులను తొలి 48 గంటల్లో తొలగించాలి. ప్రైవేటు ప్రాంతాల్లో ప్రచారాలకు సంబంధించిన వాటిని తదుపరి 24 గంటల్లో తొలగించనున్నారు.

# రాత్రి చలి.. పగలు వేడి



ఖమ్మం : పగలు వేసవిని తలపించేలా ఎండ... రాత్రి మంచు కురుస్తూ చలి వాతావరణం నెలకొంటోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అక్టోబరులోనూ వేసవిని తలపిస్తూ ఉష్ణోగ్రతలు భగ్గుమంటున్నాయి. సరైన వర్షాలు కురవకపోవడంతో భూతాపం కొనసాగుతోంది. బయట వాతావరణం రాత్రి కొంత చల్లబడుతున్నా ఇళ్లల్లో ఉక్కపోతతో ఇక్కట్లు తప్పటం లేదు. సాగు, గృహ, వాణిజ్య విద్యుత్తు డిమాండ్ భారీగా పెరిగింది.

విద్యుత్తు డిమాండ్

ఉభయ జిల్లాల్లో భూమి చల్లబడకపోవడంతో గృహ, వాణిజ్య విద్యుత్తు వినియోగం భారీగా ఉంటోంది. వర్షాలతో వాతావరణం చల్లబడాల్సిన సమయంలో నివాసాలు, వాణిజ్య ప్రాంతాల్లో ఏసీలు, కూలర్లను వినియోగిస్తున్నారు. కురిసిన అరకొర వర్షాలకు పత్తి, మిర్చి, మొక్కజొన్న, కూరగాయలు, పూలు, బొప్పాయి వంటి పలు రకాల పంటలు సాగు చేశారు. ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. అలాగే పామాయిల్ అధికంగా సాగులో ఉంది. బెట్ట వాతావరణంతో వీటికి తడులు పెట్టేందుకు రైతులు విద్యుత్తును అధికంగా వినియోగిస్తున్నారు. అందుకే వ్యవసాయ విద్యుత్తు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ఉప కేంద్రాలపై ఒత్తిడి అధికమవుతోంది.

వినియోగం..

ఉభయ జిల్లాల్లో (అక్టోబరు 10న) ఉదయం 11:12 గంటల సమయంలో 651 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ ఏర్పడింది. గత ఏడాది ఇదే రోజు డిమాండ్ కేవలం 278 మెగావాట్లు నమోదైంది.

గతేడాదితో పోల్చితే..

ఖమ్మం జిల్లాలో రోజువారీగా 5.41 మి.యూ. విద్యుత్తు కోటా కేటాయిస్తున్నారు. కానీ అక్టోబరు 7న అత్యధికంగా 7.783 మిలియన్ యూనిట్లు, 8న 7.487 మియూ, 9న 7.534 మియూ విద్యుత్తు వినియోగించారు. అక్టోబరు తొలి 9 రోజుల్లో 48.69 మి.యూ. విద్యుత్తు కేటాయించగా మొత్తంగా 63.957 మి.యూ. అంటే 15.267 మియూ విద్యుత్తు అదనంగా వినియోగించడం గమనార్హం. గతేడాది 2022 ఆగస్టులో మొత్తంగా 137.2 మి.యూ, 2023 ఆగస్టులో 191.7 మి.యూ. విద్యుత్తు వినియోగించారు. గత ఏడాది ఆగస్టు కన్నా ఈ ఏడాది 54.5 మి.యూ. అదనంగా వినియోగించారు. 2023 సెప్టెంబరులో... 168.74 మి.యూ. విద్యుత్తు వినియోగించారు.

ఉపకేంద్రాలపై ఒత్తిడి..

జిల్లాలో వ్యవసాయ విద్యుత్తు విపరీతమైన డిమాండ్‌తో ఉప కేంద్రాలపై ఒత్తిడి ఏర్పడుతోంది. దీంతో వ్యవసాయ విద్యుత్తుకు అనధికార కోతలు విధిస్తున్నారు. విద్యుత్తు కోసం పడిగాపులు కాస్తున్న రైతులు ఆగ్రహంతో రోడ్డెక్కే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. ఏసీ లేకుండా ఉండలేని పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయానికి అధిక డిమాండ్ ఉంది.

అసాధారణంగా విద్యుత్తు వినియోగిస్తున్నారు. అయినా విద్యుత్తు సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ఎటువంటి ఆటంకాలు లేకుండా నిరంతర విద్యుత్తు సరఫరా చేస్తున్నాం.సురేందర్, ఎస్ఈ, ఎన్‌పీడీసీఎల్, ఖమ్మం

# గ్రీన్‌ఫీల్డ్‌తో డొంక రోడ్లు కనుమరుగు



ఖమ్మం : చింతకాని మండలం కొదుమూరు-వందనం మధ్య దశాబ్దాలుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్న డొంక రహదారికి అడ్డంగా గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి వెళ్తోంది. ఇక్కడ ఎలాంటి అండర్‌పాస్‌లు, అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేయటం లేదు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన 450 మందికి పైగా రైతులు తమ భూముల్లో సాగు చేయడమెలా అంటూ తలలు పట్టుకున్నారు.

అల్లీపురం నుంచి రామకృష్ణాపురం వరకూ వెళ్లేందుకు గోళ్లపాడు డొంక దశాబ్ద కాలంగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. దీని గుండా ఖమ్మం నగర సమీపంలోని అల్లీపురం, రామకృష్ణాపురం, అనంతసాగర్, ధంసలాపురం, కొత్తగూడెం, బస్వాపురం రైతులు కొన్ని దశాబ్దాలుగా వెళ్తూ పంటలు పడిస్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారి వల్ల ఈ డొంక కనుమరుగయ్యే దుస్థితి నెలకొంది. దీంతో వెయ్యి మందికి పైగా రైతులకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్‌హెచ్ అధికారులు కేవలం రైతులు నడిచి వెళ్లేందుకు వీలుగా దిగువ భాగంలో చిన్న కాలినడక లో-లెవల్ వంతెన ఏర్పాటు చేసే మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. దీన్ని రైతులు అడ్డుకున్నారు.

పెనుబల్లి మండలం కొండ్రుపాడు రెవెన్యూలో వ్యవసాయ భూముల గుండా వెళ్లే డొంక రహదారి ప్రదేశంలో చిన్న లోలెవల్ వంతెన(అండర్‌పాస్) ఏర్పాటు చేసేందుకు ఎన్‌హెచ్ అధికారులు నిర్ణయించారు. వేంసూరు మండలం భీమవరం-లింగపాలెం గ్రామాల మధ్య అనుసంధాన రహదారి వద్ద తీరు. కొద్ది ఎత్తులో.. తక్కువ వెడల్పుతో వంతెన ఏర్పాటు వల్ల కనీసం పంటలు నూర్చేందుకు హార్వెస్టర్లు, ట్రాక్టర్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడనుంది.

పొలాలకు వెళ్లేదెలా అని రైతుల ఆందోళన

సూర్యాపేట-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వేగంగా సాగుతున్నాయి. ఈ రహదారి జిల్లాలో ఖమ్మం గ్రామీణ మండలం పొన్నేకల్లు నుంచి ప్రారంభమై సత్తుపల్లి మండలం తుమ్మూరు వరకూ వెళ్లి ఆ తరువాత ఏపీలోకి ప్రవేశిస్తుంది. జిల్లాలో 92 కిలోమీటర్ల నిడివిలో నిర్మిస్తున్న జాతీయ రహదారి పలు రెవెన్యూ గ్రామాల నుంచి వెళుతోంది. అడ్డంగా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వెళుతుండటంతో డొంక రోడ్లు రెండు భాగాలుగా విడిపోనున్నాయి. దీంతో వందలాది మంది రైతులు పొలాలకు వెళ్లే సౌలభ్యం లేక అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. అక్కడ లో లెవల్ వంతెన(అండర్‌పాస్)లను కూడా ఏర్పాటు చేయకపోవటంతో రైతులు పనులను అడ్డుకోవటంతో పాటు ఆందోళనలు సైతం చేపడుతున్నారు. ప్రతి డొంక రోడ్డు వద్ద లో లెవల్ వంతెన నిర్మించాలని అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నారు.

జిల్లాలో 1,656 ఎకరాల సేకరణ

గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి కోసం ప్రభుత్వం ఒక కిలోమీటరుకు 18 ఎకరాల భూమి చొప్పున సేకరించింది. ఖమ్మం జిల్లాలో ఇలా 92 కి.మీ. నిడివిలో 1,656 ఎకరాలు భూమిని సేకరించాల్సి వచ్చింది. ఈ నిడివిలో చింతకాని, కొణిజర్ల, వైరా, సత్తుపల్లి, కల్లూరు, వేంసూరు, ఖమ్మం గ్రామీణ మండలాల్లో దశాబ్దాలుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్న పలు డొంకదారులు తమ ఉనికి కోల్పోయే పరిస్థితి నెలకొంది.

తలెత్తే నష్టాలు దశాబ్దాలుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్న డొంక రహదారులకు అడ్డంగా జాతీయ రహదారి వెళ్లడంతో రెండు వైపులా ఉన్న తమ పంట భూములకు రైతులు, ప్రజలు చేరలేని పరిస్థితి. ఎన్‌హెచ్ రహదారికి ఇరువైపులా హద్దుగా ఆరు అడుగుల ఎత్తులో కాంక్రీట్ గోడ ఏర్పాటు చేయనుండటంతో కనీసం కాలినడకన సైతం రోడ్డు దాటలేరు. కంటి కన్పిస్తున్న పొలాల వద్దకైనా కిలోమీటర్లు తిరిగి రావాల్సి ఉంటుంది. ఇక పంట ఉత్పత్తులు తరలించడం, ఇతర పనులకు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు రావాలంటే ఎంతో వ్యయప్రయాసలు ఏర్పడతాయి.ఇలా చేస్తే మేలుడొంక రోడ్ల ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ రహదారి ఎత్తు పెంచాలి. అక్కడ ట్రాక్టర్లు, హార్వెస్టర్లు వెళ్లే ఎత్తులో లోలెవల్ వంతెన నిర్మించాలి.డొంక రోడ్ల ప్రాంతంలో హార్వెస్టర్లు, ట్రాక్టర్లు వెళ్లే విధంగా లో లెవల్ వంతెనలు ఏర్పాటు చేయాలి. లేకపోతే వందలాది ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముంది. దీనిపై ఆందోళనలు తీవ్రతరం చేస్తాం.-రావూరి సైదుబాబు, బాధిత రైతు, అల్లీపురంరైతులు, స్థానికుల నుంచి వచ్చిన ప్రతి వినతి పత్రాన్ని ఎన్‌హెచ్ కేంద్ర కార్యాలయానికి పంపాం. రహదారి ఏర్పాటులో మార్పుల కోసం కేంద్ర కార్యాలయం అనుమతి కోసం ఇప్పటికే ప్రతిపాదనలను పంపాం. అక్కడి నుంచి అనుమతులు వస్తేనే మార్పులు చేపట్టే అవకాశం ఉంది. రైతులకు ఇబ్బందులు కలగనీయం.-దివ్య, గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి టెక్నికల్ మేనేజర్

# ప్రయాణికులపై ప్రత్యేక దృష్టి

ఖమ్మం : బతుకమ్మ ఉత్సవాలు, విజయదశమి పండుగను పురస్కరించుకొని ప్రయాణికులు సొంతూళ్లకు సులభంగా వెళ్లేందుకు ఖమ్మం రీజియన్ పరిధిలో 695 బస్సులను ప్రత్యేకంగా నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటే బస్సుల సంఖ్యో మరింత పెంచాలని యోచిస్తున్నారు. శుక్రవారం నుంచి ఈనెల 23 వరకు, తిరుగు ప్రయాణం కోసం ఈనెల 25 నుంచి 29 వరకు సాధారణ ఛార్జితో బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ఖమ్మం-హైదరాబాద్ మార్గంలో 24 గంటలపాటు బస్సులు నడపనున్నారు. రీజియన్ పరిధిలో ఖమ్మం నుంచి మణుగూరు, భద్రాచలం, సత్తుపల్లి, కొత్తగూడెం, మధిర, ఇల్లెందు ప్రాంతాలకు అన్నివేళలా బస్సులు తిరుగుతాయి. ప్రయాణికుల రద్దీ మార్గాలను ముందుగానే అంచనా వేసి ఎక్కువ ఆదాయాన్ని గడించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. బస్సుల రాకపోకల విషయంలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షించేలా ఆరు డిపోల మేనేజర్లకు ఆర్ఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.సంప్రదించాల్సిన నంబర్లు..ప్రయాణికులు బస్సుల సమాచార నిమిత్తం హైదరాబాద్ ఎంబీబీఎస్-99594 46673, ఎల్బీనగర్- 94939 77790, ఖమ్మం కొత్త బస్టాండ్-99592 25979 విచారణ కేంద్రాల నంబర్లను సంప్రదించాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేశాం. ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా బస్సుల్లో ప్రయాణించాలి. సీహెచ్ వెంకన్న, ఆర్ఎం, ఖమ్మం

# ఒళ్లు కాలుతోంది..!

నల్గొండ : జిల్లాలో విష జ్వరాలు కమ్ముకున్నాయి. ప్రతి పది మందిలో ఇద్దరు సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారు. డెంగీ, మలేరియాతో పట్టణాలు, పల్లెలు అల్లాడుతున్నాయి. గత వారం రోజులుగా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. సూపర్‌స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ పేర్లతో నడుస్తున్న కొన్ని ఆసుపత్రులు డెంగీ జ్వరం మూలంగా రక్తకణాలు తగ్గుతున్నాయంటూ రోగులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. గడిచిన పదినెలల్లో జిల్లాలో 264 మంది డెంగీ బారిన పడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

నల్గొండ జనరల్ ఆసుపత్రికి వారం రోజుల క్రితం వరకు నిత్యం 500 నుంచి 600 వరకు ఓపీ ఉంటే.. ప్రస్తుతం 800 నుంచి 900 మంది వస్తున్నారు. దేవరకొండ ఏరియా ఆసుపత్రిలో గత మూడు రోజులుగా 800 మందికి తగ్గకుండా ఓపీ చికిత్స కోసం వస్తున్నారు. మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి 600 నుంచి 750 మంది, నాగార్జున సాగర్ 250 నుంచి 300, నకిరేకల్ ఆసుపత్రికి 200 నుంచి 300 మంది హాలియా, మర్రిగూడ సీహెచ్‌సీ ఆసుపత్రుల్లో 200 నుంచి 250 మంది ఓపీ చికిత్స పొందుతున్నారు. ప్రతి ఆసుపత్రిలో మంచాల స్థాయికి మించి రోగులు చికిత్సలు పొందుతున్నారు. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, బస్తీదవాఖానాల్లో సైతం 150 నుంచి 200 మంది ఓపీ చికిత్సలు పొందుతున్నారు. వీరిలో జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి, ఒళ్లు నొప్పులతో వచ్చే వారు 80 నుంచి 90 శాతం మంది ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

నకిరేకల్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి ఆగస్టులో 4,679 మంది బయటి రోగులు(ఓపీ), 494 ఐపీగా చికిత్సలు పొందారు. సెప్టెంబరులో ఓపీ 6,094, ఐపీ 527గా నమోదయింది. నిత్యం



300 నుంచి 350 మంది వరకు రోగులు వస్తున్నారు. వీరిలో అధికశాతం మంది జ్వరాల బాధితులే ఉంటున్నారు.

సొంత వైద్యం చేసుకోవద్దు:

డా.మాతృనాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి

ప్రస్తుత సీజన్‌లో ఎక్కువ మంది జ్వరాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. మరి కొందరు నిర్లక్ష్యం చేస్తూ మందుల షాపుల్లో దొరికే మాత్రలు తీసుకుని సొంత వైద్యం చేసుకుంటున్నారు. పరిస్థితి ఎక్కువైన తరువాత ఆసుపత్రుల బాట పడుతున్నారు. అలా కాకుండా లక్షణాలు కన్పించిన వెంటనే వైద్యులను సంప్రదిస్తే తొందరగా కోలుకునే అవకాశం ఉంటుంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారితో పాటు నవజాత శిశువులు, చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధుల్లో ఎక్కువగా డెంగీ పెరుగుతుంది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంపులు డ్రమ్ములు, నీటితొట్ల మీద మూతలు పెట్టుకోవాలి. ఇంటి పైకప్పుల పైన టెర్రస్లు, సన్‌షెడ్ల పైనా నిరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

అప్రమత్తత అవసరం:దుర్గయ్య, జిల్లా మలేరియా అధికారి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. విష జ్వరాలు పెరుగుతున్నందున జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిస్తూ ఇంటి పరిసరాలు శుభ్రం చేసుకోవాలి. జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కన్పిస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలి.

# పురంలోకి వచ్చేశాయ్.. స్టీల్ బ్యాంకులు

సూర్యాపేట : ప్లాస్టిక్ నివారణతో పాటు పర్యావరణ రహిత పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు పురపాలికల్లో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించి వారికి ఆర్థికంగా ఊతమిచ్చేందుకు పట్టణాల్లో వీటి ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పురపాలక శాఖమంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు పట్టణ పేదరిక నిర్మూలన (మెప్మా) సంస్థ ఆధ్వర్యంలో సూర్యాపే ట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా వీటిని నెలకొల్పారు.

ఉమ్మడి జిల్లాలో ఆరు..ప్రతి జిల్లా కేంద్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల భాగస్వామ్యంతో పట్టణ సమాఖ్య ద్వారా స్టీల్ బ్యాంకులను నెలకొల్పారు. యాదాద్రి జిల్లాలోని భువనగిరిలో రూ.1.60 లక్షలతో ఒకటి, నల్గొండలో రూ.4.56 లక్షలతో రెండు, మిర్యాలగూడ ఒకటి, సూర్యాపేటలో రూ.6.34 లక్షలతో రెండు బ్యాంకులు ప్రారంభించారు. ప్రస్తుతం వేడుకల్లో జరిగే విందుల్లో అధికంగా ప్లాస్టిక్ ప్లేటు, గ్లాసులు వాడుతున్నారు. వాటి స్థానంలో స్టీల్ ప్లేట్లు, గ్లాసులు వినియోగించా లనేది ఈ బ్యాంకుల ఉద్దేశం. అందుకు ఈ కేంద్రం నిర్వాహకులు పట్టణాల్లోని వేడుకల మందిరాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించే వారిని గుర్తించి తమ వద్ద ఉన్న స్టీల్ సామగ్రి వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తారు.

నిర్వహణకు నిధులిలా..

పట్టణ సమాఖ్యకు మహిళలు ప్రతి నెలా చెల్లించే పొదుపు నిధులతో స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేస్తున్నారు. సుమారు ఐదు వందల మందికి సరిపడా స్టీల్ ప్లేట్లు, గ్లాసులు కొనుగోలు చేసి అవసరమైన వారికి తక్కువ ధరకు సరఫరా చేస్తారు. మెప్మా ఆర్పీల పర్యవేక్షణలో ఆ సమాఖ్యలోని సభ్యులు విడతల వారీగా ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతలు చూస్తారు. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పట్టణ సమాఖ్యలో జమ చేసి దాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసుకుంటారు. లాభాలను సభ్యులు తమ అవసరాల మేరకు సర్దుబాటు చేసుకుంటూ ఆర్థిక అవసరాలు తీర్చుకుంటారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలిస్తే అన్ని పురపాలక సంఘాల్లో అమలు చేయనున్నట్లు జిల్లా మెప్మా అధికారులు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుతాం

పిట్టల రాణి, స్ఫూర్తి పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, సూర్యాపేట ప్లాస్టిక్ వినియోగంతో ప్రమాదం పొంచి ఉంది. దీన్ని పూర్తిస్థాయిలో నివారించేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో సూర్యాపేటలో స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేశాం. ప్రజలకు వీటి వాడకంపై సంఘం సభ్యులం అవగాహన కల్పించి సూర్యాపేటను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుతాం. ప్రభుత్వం కూడా సహకారం అందిస్తుండటంతో విజయవంతంగా స్టీల్ బ్యాంకు నిర్వహిస్తాం.

# అంగన్‌వాడీల నిర్వహణకు పప్పుతిప్పలు!

కొత్తగూడెం : పేద కుటుంబాల చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు మళ్లీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. లబ్ధిదారులు మెనూ ప్రకారం బలవర్ధక ఆహారానికి నోచుకోవడం లేదు. అందుక్కారణం.. చాలాచోట్ల నూనె, పప్పులు పంపిణీ నిలిచిపోవడమే. వీటిని ప్రభుత్వం ప్రతి రెణ్నెల్లకోసారి సరఫరా చేయాల్సి ఉంది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలకు ఇంకా అందించలేదు. దీంతో కొందరు ఉపాధ్యాయురాళ్లే సొంతంగా ఖర్చు భరించి సరకులు కొనుగోలు చేస్తున్నారు. కొత్తగూడెం 9, పాల్వంచ 4, బూర్గంపాడు 3, దుమ్ముగూడెం 3, చర్ల 8, దమ్మపేట 7, చంద్రుగొండ 5, అశ్వారావుపేట 8, మణుగూరు 10, టేకులపల్లి 3, ఇల్లెందు సెక్టారులో మూణ్నెల్లకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు నిర్వాహకుల ద్వారా తెలుస్తోంది.

కూర'గాయాలూ' తప్పడం లేదు..

కూరగాయల బిల్లులు ఏడాది కాలంగా చెల్లించడం లేదని అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయినులు వాపోతున్నారు. నిత్యావసరాలకు 18 ఏళ్ల క్రితం నిర్ణయించిన ధరలనే అమలు చేస్తున్నారని, ఎన్నో రెట్లు పెరిగినా పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. మెనూలో ఉండే బాలామృతం, బియ్యం మాత్రమే ప్రస్తుతం సక్రమంగా సరఫరా



అవుతున్నాయని పేర్కొంటున్నారు. గత నెల మార్చి 20 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు 'పోషణ్ పక్వాడా' కార్యక్రమాలను సైతం నిర్వహించారు. చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల నిర్వహణ ఖర్చులనూ నిర్వాహకులకు చెల్లించాల్సి ఉంది.

అందని గ్యాస్ బిల్లులు

సిలిండర్ బిల్లులు ఏడాది కాలంగా అందడం లేదు. ఒక్కో అంగన్‌వాడీలో నెలకు సగటున 10 నుంచి 12 సిలిండర్లు వినియోగిస్తారు. వీటిని సొంతంగా నిర్వాహకులే జీతభత్యాల్లోంచి కొనుగోలు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం తర్వాత చెల్లిస్తోంది. గ్యాస్ బిల్లులూ ఏడాదిగా చెల్లించడం లేదని పలువురు నిర్వాహకులు వాపోతున్నారు. కొత్త పొయ్యిలు కూడా అందించడం లేదు. సిలిండర్ల రవాణాకు రూ.150 నుంచి రూ.200 వరకు ఖర్చవుతున్నా సొంతంగా భరిస్తున్నారు.

అంగన్‌వాడీలకు కావాల్సిన పప్పు, నూనెను వారంలోగా సరఫరా చేస్తాం. కొందరు గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా సరకుల అందజేతలో ఆలస్యమైంది. ప్రభుత్వ చర్యలతో త్వరలోనే అందజేయనున్నాం. సిలిండర్ల బిల్లుల వివరాలు కూడా పంపించాం. ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే ఉపాధ్యాయినులకు చెల్లిస్తాం.

జెఎం స్వర్ణలత లెనీనా, జిల్లా సంక్షేమాధికారి

# కదిలిన దస్త్రం..

కొత్తగూడెం : జూలూరుపాడులో వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ముప్పై పడకల ఆసుపత్రి భవనంలో సీహెచ్‌సీ సేవల ప్రారంభానికి ఆటంకాలు తొలగుతున్నాయి. దీనికి సంబంధించిన దస్త్రం పరిశీలనలో ఉండటంతో రెండు, మూడు నెలల్లో వైద్య సేవల పరంగా మార్పులు చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది. ముప్పై పడకల ఆసుపత్రి కోసం నిర్మించిన భవనంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొనసాగుతోంది. ఈ భవనం వైద్యవిధాన పరిషత్‌కు అప్పగిస్తే అక్కడ నుంచి పీహెచ్‌సీని ఇతర ప్రాంతానికి మార్చాలి. వైద్యశాఖ ఉన్నతాధికారులు ఇతర గ్రామాల్లో పీహెచ్‌సీని ఏర్పాటు చేసే యోచనపై పరిశీలన చేశారు.

జూలూరుపాడు పరిసర మండలాల గిరిజన ప్రజలు ఎన్నో ఏళ్లుగా మెరుగైన సేవలు కల్పించాలని కోరుతున్నారు. అనేక ప్రజాసంఘాలు, పార్టీలు ఆందోళనలు నిర్వహించి వినతులు అందజేశారు. గతంలోని శాసనసభ్యులు సైతం వైద్య సేవల విషయమై కృషి చేస్తామని హామీలు ఇచ్చినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం ప్రభుత్వమే సేవల విస్తరణకు సముఖంగా ఉండటంతో కొద్ది రోజుల్లోనే జూలూరుపాడులోని ఆసుపత్రి భవనం వైద్యవిధాన పరిషత్‌కు అప్పగించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే సైతం దీనిపై దృష్టి సారిస్తే మరింత తొందరగా ఈ ప్రక్రియ అమలయ్యే అవకాశం లేకపోలేదు. గతంలో సీహెచ్‌సీ ఏర్పాటు ప్రతిపాదనలు చేసినా దస్త్రాలేవీ లేకపోవడంతో జాప్యం జరిగింది. ఇటీవల జిల్లా వైద్యాధికారి దృష్టి సారించడం, స్థానిక వైద్యుడు రాకేశ్‌కుమార్ మళ్లీ కొత్తగా ప్రతిపాదనలు పంపడంతో కదలిక వచ్చింది.

పీహెచ్‌సీ మార్చాలి

జూలూరుపాడులో సామాజిక ఆరోగ్య కేంద్రం కోసం నిర్మించిన భవనాన్ని 2007లోనే అప్పటి కుటుంబ, ఆరోగ్యశాఖ మంత్రి సంభాని చంద్రశేఖర్ ప్రారంభించారు. అప్పటి నుంచి సేవలు అందుబాటులోకి వస్తాయని ఆశించినా సాధ్యం కాలేదు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించి జిల్లాలోని చర్ల, జూలూరుపాడు పీహెచ్‌సీలను సీహెచ్‌సీలుగా మార్చాలనే ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జూలూరుపాడులో సీహెచ్‌సీ ఏర్పాటు చేయాలంటే పీహెచ్‌సీని మరోచోటకు మార్చాలి. పడమటినర్సాపురం లేదంటే గుండెపూడి గ్రామాల్లో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొత్తగా వైద్యశాలను నిర్మించేందుకు రూ.1.20 కోట్లు నిధుల మంజూరుకు సిద్ధంగా ఉంది. పీహెచ్‌సీ ప్రస్తుత భవనం నుంచి తరలిపోవడమే తరువాయి సీహెచ్‌సీ సేవలు ప్రారంభించనున్నట్లు తెలిసింది.'

అందుబాటులోకి వచ్చే సేవలు

సీహెచ్‌సీ ఏర్పాటుచేస్తే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. శస్త్రచికిత్సలు, చిన్నపిల్లలు, మహిళలు, దంత వైద్య సేవలు ఇలా ఎంతోమంది వైద్య నిపుణులు రానున్నారు. ఇదే జరిగితే అటు 20కి.మీ. దూరం ఉన్న కొత్తగూడెం, ఇటు 60కి.మీ. దూరంలోని ఖమ్మం వెళ్లాల్సిన అవసరం ఉండదు. చంద్రుగొండ, సుజాతనగర్, ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు మండలాల ప్రజలకూ వైద్యసేవలు అందుబాటులో ఉండనున్నాయి.

"జూలూరుపాడులో సీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే వైద్యవిధాన పరిషత్‌కు ఈ భవనాన్ని అప్పగించాల్సి ఉంది. ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తాత్కాలికంగానైనా వేరే చోటుకు తరలిస్తేనే సేవలు ప్రారంభం అవుతాయి."రాకేశ్‌కుమార్, ప్రభుత్వ వైద్యుడు, జూలూరుపాడు

# ఇంకెన్నాళ్లీ డొంక తిరుగుడు సమాధానం..?



ఖమ్మం :తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూముల్లో ఏళ్ల తరబడి పంటలు పండించుకున్నారు. అధికారుల నిర్వాకమో.. ఆన్‌లైన్‌లో తప్పిదమో కానీ.. అకస్మాత్తుగా వారి భూములకు వెళ్లే దారి మాయమైంది. సేద్యం చేసే భూములన్నీ బీడుగా దర్శనమిస్తున్నాయి. ఆ రైతులంతా కాడి వదిలేసి కూలీ పనులకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. సాగు భూములకు వెళ్లేందుకు దారి చూపండి మహాప్రభో అంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.రెండేళ్లుగా బీళ్లుగానే.. నేలకొండపల్లి మండలం తిరుమలాపురంతండాకు చెందిన సుమారు 50 మంది గిరిజనులకు 70 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. క్రమేణా వీరి పంట పొలాలకు వెళ్లే దారి కనుమరుగవటంతో రెండేళ్లుగా రైతులు సాగుకు దూరమయ్యే పరిస్థితి తలెత్తింది. చుట్టుపక్కల భూములు పచ్చని పంటలతో కళకళలాడుతుంటే.. వీరి భూములు మాత్రం బీళ్లుగా మారాయి.

అన్నదాతల పోరుబాట

తరాలుగా తమ భూముల్లోకి వెళ్లేందుకు ఉన్న దారి కనుమరుగవడంతో గిరిజన రైతులు పోరుబాట పట్టారు. వీరి వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు తిరుమలాపురంతండాలో 1927 నాటి నక్షాలో డొంక దారి చుట్టూ సుమారు 50 మంది గిరిజనులకు చెందిన 70 ఎకరాల భూములు ఉన్నాయి. రెండేళ్ల క్రితం దారి మాయమైంది. దశాబ్దాల పాటు పంటలు పండిస్తున్న తమను రెండేళ్లుగా భూముల్లోకి వెళ్లనీయకుండా కొందరు అడ్డుకుంటున్నారని అధికారులకు బాధితులు ఫిర్యాదు చేశారు. అయితే.. తాజా నక్షాలో దారి లేదని అధికారులు గుర్తించడంతో వీరి సమస్య మరింత జటిలమైంది. స్థానిక రైతులంతా సమాచార హక్కు చట్టం ద్వారా 1927 నాటి నక్షాను సాధించారు. అందులో గ్రామకంఠం భూమి, 30 అడుగుల డొంక రహదారి స్పష్టంగా ఉందన్న విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నక్షా ఆధారంగా జిల్లా అధికారులను కలిశారు. గిరిజన రైతుల సమస్య పరిష్కరించాలని మండల రెవెన్యూ అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు. అయినా సమస్య తీరలేదు. అందుకే.. బాధిత రైతులు కరపత్రాలు ముద్రించి న్యాయం చేయాలంటూ ఆందోళనలకు పూనుకున్నారు.మాకు వారసత్వంగా భూమి సంక్రమించింది. చాలా ఏళ్లుగా పంటలు పండించుకున్నాం. రెండేళ్ల నుంచి దారి లేక పంటలు సాగు చేయడం లేదు. చుట్టుపక్కల రైతులంతా పంటలు పండించుకుంటున్నారు. మేము మాత్రం మా భూములను బీడుగా ఉంచుకోవాల్సి వస్తుంది. భూక్యా రమా, తిరుమలాపురంతండా

మా నాన్న నుంచి సంక్రమించిన భూమిలో దశాబ్దాలుగా పంటలు పండిస్తున్నాం. రెండేళ్ల క్రితం దారి లేకుండా కొందరు ఫెన్సింగ్ వేసుకున్నారు. బాట కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవట్లేదు.

మోహన్‌రావు, తిరుమలాపురంతండా

వ్యవసాయ భూములకు వెళ్లేందుకు దారి లేదని, న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుత నక్షాలో డొంక దారి లేదు. అయినా వారి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతున్నాం.

ధార ప్రసాద్, తహసీల్దారు, నేలకొండపల్లి

# చిట్కాలు ముఖ్యం.. పునశ్చరణ అవసరం



ఖమ్మం : ప్రాథమిక, దేహదారుఢ్య పరీక్షల్లో సత్తాచాటిన ఎస్సై అభ్యర్థులకు ప్రధాన పరీక్ష శని, ఆదివారం జరగనుంది. నెలల తరబడి చదివిన అనేక అంశాలను మూడు గంటల్లో ఎంత మెరుగ్గా రాస్తారనే అంశంపైనే భవితవ్యం ఆధారపడి ఉంటుందని గ్రహించాలి. ఇలాంటి సమయంలో అభ్యర్థులు ఏవిధంగా మెలగాలి, పరీక్ష సమయంలో ఎలా వ్యవహరించాలో నిపుణుల అభిప్రాయాలతో కథనం.

గందరగోళానికి గురికావొద్దు

పరీక్ష సమయంలో అభ్యర్థులు గందరగోళానికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలి. నిర్ణీత సమయం కంటే ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. పరీక్ష ముందురోజు ప్రశాంతంగా నిద్రపోవాలి. ఒత్తిడికి గురికావటం వల్ల పరీక్ష కేంద్రంలో పొరపాటు చేసే ఆస్కారముంది. ఇంతకాలం చదివిన వాటిలో ప్రధానాంశాలను చివరి రోజు పునశ్చరణ చేసుకోవటం ఉత్తమం.

తెలిసిన ప్రశ్నలనే తొలుత ఎంచుకోవాలి..

ఎం.రాధాకృష్ణ, అర్థమెటిక్ ఎక్స్‌పర్ట్ : అర్థమెటిక్, రీజనింగ్ పేపర్‌లో అన్ని ప్రశ్నలను నిశితంగా ఒకసారి చదవాలి. బాగా తెలుసు అనుకున్న ప్రశ్నలను తొలుత ఎంచుకొని మొదటి రెండు గంటలు జవాబులకు కేటాయించాలి. తెలియని ప్రశ్నల కోసం ఆలోచించి సమాధానాలు రాసేందుకు మిగతా గంట సమయాన్ని వినియోగించుకోవాలి. మ్యాథమెటికల్ స్టూడెంట్ ముందే అర్థమెటిక్ ప్రశ్నలను ఎంపిక చేసుకోవాలి. ఆ తరువాత రీజనింగ్‌పై దృష్టి సారించాలి. అప్పుడే సునాయసంగా అన్నింటిని రాయగలుగుతారు.

నెగిటివ్ మార్కులుండవు

పంపన శివప్రసాద్, పోటీ పరీక్షల నిపుణుడు : ఎస్సై మెయిన్స్ పరీక్షలో పదోతరగతి స్థాయిలో ఉండే తెలుగు, ఆంగ్ల పేపర్లుంటాయి. వీటిలో అర్హత సాధిస్తేనే జనరల్ స్టడీస్, అర్థమెటిక్ రీజనింగ్ పరీక్ష పత్రాలు దిద్దుతారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ప్రిలిమినరీ పరీక్షల మాదిరిగా మెయిన్స్‌లో నెగిటివ్ మార్కులుండవు. జనరల్ స్టడీస్‌లో హిస్టరీ ఆఫ్ ఇండియా, తెలంగాణ చరిత్ర, తెలంగాణ ఉద్యమం, రాజ్యాంగం, వర్తమాన వ్యవహారాలు, భూగోళశాస్త్రం ఉంటాయి. మ్యాథ్స్ విషయంలో సమయం వృథా కాకుండా జాగ్రత్తపడాలి. సాధ్యమైనంత వరకు అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.

# లెక్క మారుతోంది..

ఖమ్మం :2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31 వరకు మద్యం అమ్మకాలు ఉమ్మడి జిల్లా పరిధిలో ఇన్వాయిస్ ప్రకారం: రూ.2272 కోట్లు (అంటే డిపో నుంచి వ్యాపారులకు కేటాయించిన ధర ప్రకారం) ఎమ్మార్పీ ప్రకారం: రూ.2702 కోట్లు అదనపు ధరకు విక్రయించడం ద్వారా..: రూ.3 వేల కోట్లకు పైగా

ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాలు ఏటేటా తారస్థాయిలో పెరుగుతున్నాయి. వీటి విలువ లెక్కింపులో ఆసక్తి రేకెత్తించే గణాంకాలు నమోదవుతున్నాయి. వైరాలోని మద్యం డిపో నుంచే ఖమ్మం, భద్రాద్రి జిల్లాలోని దుకాణాలు, బార్లకు మద్యం సరఫరా అవుతోంది. ఏటా ఆర్థిక సంవత్సరం పూర్తి కాగానే ఎంత విలువైన సరకు విక్రయించారో సరిచూస్తున్నారే కానీ తుది అంకానికి చేరేసరికి భారీ వ్యత్యాసాలుంటున్నాయి. వ్యత్యాసం ఏదో రూపాయో లేక రూ.లక్ష కాదండోయ్... నిశితంగా పరిశీలిస్తే రూ.వందల కోట్లలో ఉంటోంది.ఉల్లంఘన విలువ ఎంతంటే..డిపో నుంచి ఇన్వాయిస్ ధరకు మద్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు దుకాణాల వద్ద ఎమ్మార్పీ ప్రకారం విక్రయిస్తుంటారు. ఎమ్మార్పీ జతచేసి విక్రయించడం వల్ల సుమారు రూ.400 కోట్లు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇక్కడ మరో మతలబు ఉంది. వ్యాపారులు కొనుగోలు చేసిన సరకును సింహభాగం బెల్టు దుకాణాల్లోనే విక్రయిస్తున్నారు. రెండు జిల్లాల పరిధిలో సుమారు 8 వేలకు పైగా బెల్టు దుకాణాలున్నాయి. రూ.200 ఎమ్మార్పీ ఉన్న క్వార్టర్ సీసా బెల్టు దుకాణదారునికి రూ.20 అదనంగా ఇస్తుంటే అక్కడ నుంచి మద్యం



కొనుగోలు చేసే వ్యక్తి నుంచి మరో రూ.15 నుంచి రూ. 20 వరకు వసూలు చేస్తున్నారు. ఎమ్మార్పీ ఉల్లంఘనతో అదనపు విలువ రూ.300 కోట్లకు పైగా ఉంటుంది.

ఎన్నికల తరుణం

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు మరో ఆరేడు నెలలు మాత్రమే సమయం ఉంది. దీంతో ఈ సీజన్ మొత్తం మద్యం అమ్మకాలు తారస్థాయిలో ఉండనున్నాయి. ఇప్పటికే ఎండల తాకిడితో బీర్ల విక్రయాలు పెరిగాయి. ఈ విక్రయాలు పెరిగినా లిక్కర్ విక్రయాలు ఏ మాత్రం తగ్గడం లేదు. వచ్చే ఎన్నికల సీజన్ కావడంతో ఈ ఏడాది విక్రయాలు ఊహించలేనంతగా ఉండే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# చిగురిస్తున్న ఆశలు

గుండాల : రెండో విడత గొర్రెల పంపిణీపై ఆశలు చిగురిస్తున్నాయి. గొల్ల, కుర్మ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం 2017 జూన్‌లో గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు సూచించారు. దీంతో జిల్లాలో ఆ దిశగా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. మొదటి విడత సజావుగా సాగినా.. రెండో విడతకొచ్చేసరికి జీవాల ధరలు పెరగడం.. ఇతర కారణాలతో కాలయాపన జరిగింది. మరోపక్షం రోజుల్లో పంపిణీ మొదలయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఇలా..ఉమ్మడి జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి 67,949 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. మొదటి విడత సమయంలో యూనిట్ విలువ రూ.1.25 లక్షలు. లబ్ధిదారులు వాటా రూ.32,250 కాగా.. మిగతా సొమ్మును ప్రభుత్వం భరించేది. ప్రస్తుతం జీవాల ధరలు పెరగడంతో ప్రభుత్వం యూనిట్ విలువ రూ.1.75 లక్షలకు పెంచడంతోపాటు లబ్ధిదారు వాటా రూ.43,750కి పెంచింది. ఈ నెలలోనే పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఆశలు చిగురిస్తున్నాయి. దాదాపు ఐదేళ్ల క్రితం యూనిట్లు మంజూరు కావడంతో ప్రస్తుతం లబ్ధిదారులు ఎందరున్నారు.. ఎక్కడున్నారు..? వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంటుందని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాకు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి జీవాలను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. పారదర్శకతకు ఈసారి జీపీఎస్ సౌకర్యమున్న



వాహనాల్లోనే వీటిని రవాణా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి టెండర్లు పిలవాల్సి ఉంది.

ఇంటింటికీ వెళ్లి పరిశీలన

రెండో విడత గొర్రెల పంపిణీకి ఎంపికైన లబ్ధిదారులను ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేయనున్నారు. ఇప్పటికే ఆయా మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించారు. వారు ఇంటికి వెళ్లి లబ్ధిదారులను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఒక వేళ లబ్ధిదారులు చనిపోతే నామినీగా భార్య, లేదా కుమారులను ఎంపిక చేస్తారు. ఎంపిక పరిశీలన పూర్తయిన వెంటనే పంపిణీ చేపట్టే అవకాశం ఉంది. పక్షం రోజుల్లో ప్రారంభంశ్రీనివా సరావు, జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి, సూర్యాపేటరెండో విడత గొర్రెల పంపిణీ విషయమై లబ్ధిదారుల వివరాలను మళ్లీ క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. మరో పక్షం రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పంపిణీ చేపడతాం.

# డబ్బులొచ్చేశాయ్..!

గుండాల : కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో చదువుతున్న బాలికల్లో నిరుపేదలు, అనాథలు అధిక సంఖ్యలో ఉంటారు. వీరికి వసతితో పాటు భోజనం, పుస్తకాలు, దుస్తులు, దుప్పట్లు ఉచితంగా ప్రభుత్వం అందజేస్తోంది. గతంలో ప్రతినెలా రూ.100 చొప్పున కాస్మెటిక్ ఛార్జీలు చెల్లించేవారు. వీటి స్థానంలో కరోనాకు ముందు వరకు పరిశుభ్రత(హెల్త్ హైజెనిక్) కిట్లు ఇచ్చారు. 2020–21 విద్యాసంవత్సరం నుంచి కిట్లు ఇవ్వలేక పోయారు. ఛార్జీలు సైతం విడుదల కాకపోవడంతో బాలికలు ఒకింత ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ప్రభుత్వం 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించిన మూడు నెలల ఛార్జీలు విడుదల చేసింది. డిసెంబరు–2022 నుంచి ఫిబ్రవరి–2023 వరకు ఒక్కో విద్యార్థినికి రూ.300 చొప్పున విడుదల చేసింది. ఆయా విద్యార్థినుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి.

ఉమ్మడి జిల్లాకు ఇలా...ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో మొత్తం 49 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 6 నుంచి 10వ తరగతి వరకు, ఎంపిక చేసిన కొన్ని కస్తూర్బాలలో ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తున్నారు. 12,057 మంది బాలికలు చదువుతున్నారు. కొందరికి ఆధార్ అప్‌డేట్ కాకపోవడం, ఖాతాలు లేకపోవడం లాంటి సమస్యలతో దాదాపు 1,383 మంది బాలికలు విద్యాశాఖకు బ్యాంకు ఖాతా నెంబర్లు ఇవ్వలేదు. ప్రస్తుతం ఖాతా నెంబర్లు అందజేసిన 10,674 మంది బాలికలకు రూ.300 చొప్పున రూ.31,81,200 ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 5,409 మందికి రూ.16,12,400, అత్యల్పంగా యాదాద్రి జిల్లాకు 2,164 మందికి రూ.6,46,400 మంజూరయ్యాయి.

# పల్లెలే.. పర్యాటక కేంద్రాలు

ఆలేరు : భారతదేశ సంస్కృతి, వారసత్వానికి గ్రామసీమలే పునాదులు అన్న విషయం జగమెరిగిన సత్యం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చారిత్రక, సంస్కృతి వారసత్వం గల గ్రామాలను ఎంపిక చేసి పర్యాటకంగా ప్రోత్సహించాలని సంకల్పించింది. ఈ నేపథ్యంలో 2023 సంవత్సరానికి జాతీయ స్థాయిలో ఉత్తమ పర్యాటక గ్రామాన్ని ఎంపిక చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కేంద్ర పర్యాటకశాఖ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రాథమికంగా మూడు గ్రామాల నుంచి ఎంట్రీలను పంపించాలని నిర్ణయించారు. ఈ గ్రామాలకు చెందిన పూర్తి చారిత్రక ప్రాధాన్యం, అభివృద్ధి, ప్రత్యేకతలకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారం పంపాలని జిల్లా పాలనాధికారి పమేలా సత్పతి ఆదేశించారు.

పూర్తి సమాచారంతో నివేదికలు

ప్రాథమికంగా ఎంపిక చేసిన గ్రామాలకు సంబంధించిన పూర్తి వివరాలతో నివేదికలు తయారు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న పురాతన ఆలయాలు, కట్టడాలు, వాటి ప్రాముఖ్యత, వాటి ఫొటోలు, గ్రామ చారిత్రక నేపథ్యం, గ్రామ ప్రజల జీవనశైలి తదితర అంశాలను సేకరిస్తారు. మొత్తం 20 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. సమాచార సేకరణ ప్రక్రియ ప్రారంభం కాగా.. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఈ నెల 15 నాటికి సమాచారం పూర్తిగా సేకరించి నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతర కాలంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ పర్యాటక గ్రామాల ఎంపిక జరుగుతుంది.

# సీఎం జగన్‌ను సత్కరించిన వీఆర్ఏ సంఘం నాయకులు





గుంటూరు: వీఆర్ఏ సంఘం నాయకులు సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. రద్దైన డీఏను పెంచి మరీ అందిస్తుండడంపై వాళ్లు ఆయనకు కృతజతలు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం గతంలో వీఆర్ఏలకు ఇస్తున్న రూ. 300 డీఏను రద్దు చేసింది.

అయితే.. ఈ విషయం సీఎం జగన్ దృష్టికి వెళ్లింది. దానిని కొనసాగించాలంటూ ఏపీజీఎఫ్ ప్రతినిధులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం రూ. 300కు బదులుగా డీఏని రూ. 500 కు పెంచి మంజూరు చేసింది.

ఈ నేపథ్యంలో.. ఏపీజీఎఫ్ ఛైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో వీఆర్ఏ సంఘ నాయకులు ధైర్యం, సత్యరాజ్, సుధాకర్, వెంకటేశ్వర్ల బృందం సీఎం జగన్‌ను సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు.

# ఉత్తరాంధ్ర నుంచి బస్సు యాత్ర మొదలు.. షెడ్యూల్ ఇదే..



విజయనగరం: రాజ్యాధికారం అన్ని వర్గాలకు అందించాలన్న ధ్యేయంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని, అన్ని ప్రధాన పదవులు వెనుకబడిన వర్గాలకు కేటాయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, అక్టోబర్ 26 నుంచి 9 వరకు ఉత్తరాంధ్రలో బస్సు యాత్ర జరుగుతుందని, ఇచ్ఛాపురం నుంచి యాత్ర మొదలవుతుందని ఆయన వివరించారు. చంద్రబాబు ఆరోగ్యంపై ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. బాబు కుటుంబ సభ్యుల సూచనలు కోర్టు పరిగణలోకి తీసుకుంటే అచరిస్తామని మంత్రి అన్నారు. రానున్న ఎన్నికల్లో గెలిచే పార్టీ వైఎస్సార్‌సీపీయే. విశాఖ కేంద్రంగా పాలనను ఉత్తరాంధ్ర ప్రజలు మనస్పూర్తిగా కోరుకుంటున్నారు" అని మంత్రి పేర్కొన్నారు. " నిన్నటి సభలో సీఎం జగన్ వాస్తవాలే మాట్లాడారు. వ్యక్తి గత దూషణలు చేయలేదు. లోకేష్ అమిత్ షాను కాదు అమితాబ్‌ను కలిసినా మాకు అభ్యంతరం లేదు. చట్ట ప్రకారం చంద్రబాబుపై చర్యలు తీసుకున్నారు కానీ వ్యక్తి గతం కాదు" అని మంత్రి బొత్స స్పష్టం చేశారు.

# చంద్రబాబుపై స్టెరాయిడ్లు ప్రయోగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది: లోకేశ



అమరావతి: రాజమహేంద్రవరం జైలులో ఉన్న తెదేపా అధినేత చంద్రబాబు ప్రాణాలకు ముప్పు ఉందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబుపై స్టెరాయిడ్లు ప్రయోగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వ వైద్యులు, జైలు యంత్రాంగం వాస్తవాలు దాస్తున్నారని మండిపడ్డారు. 'చంద్రబాబుకు ఏదైనా హాని జరిగితే జగన్‌దే బాధ్యత. చంద్రబాబు ప్రాణాల పట్ల దురుద్దేశంతో కుట్రలు పన్నారు. తగినంత భద్రత లేక చంద్రబాబు ఎంతో ప్రమాదంలో ఉన్నారు. జైలులో చంద్రబాబు భయంకరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. దోమలు, కలుషిత నీటితో ఇబ్బంది పడుతున్నారు. ఇన్‌ఫెక్షన్, అలర్జీతో బాధపడుతున్నారు' అని లోకేశ్ ట్వీట్ చేశారు. జైలులో చంద్రబాబు ప్రాణాలకు ముప్పు ఉందని నారా బ్రాహ్మణి ఆందోళన వ్యక్తం చేశారు. 'ఆయనను అపరిశుభ్రమైన జైలులో నిర్బంధించడం హృదయవిదారకం. ఆయన ఆరోగ్యంపై అపరిశుభ్రత తీవ్ర ప్రభావం చూపుతోంది. చంద్రబాబు ఆరోగ్యంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయనకు సకాలంలో వైద్యం అందట్లేదు. తక్షణ వైద్య సహాయం అవసరం' అని అన్నారు. మరోవైపు చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై తెదేపా నేతలు రాజమహేంద్రవరంలో జైలుభరో కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు.

# చంద్రబాబును డాక్టర్లు చెక్ చేసినట్టు ఎక్కడా లేదు.. అసలు రిపోర్ట్ ఎక్కడ?



రాజమండ్రి : జైలు శాఖ ఇన్ చార్జ్ పర్యవేక్షణాధికారి రాజ్ కుమార్ విడుదల చేసిన హెల్త్ బులిటన్‌లో సరైన వివరాలు లేవని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. డాక్టర్లు చెక్ చేసినట్టు హెల్త్ బులిటెన్‌లో ఎక్కడా లేదన్నారు.

అసలు చెక్ చేసిన రిపోర్టు ఎక్కడ ఉందని యనమల ప్రశ్నించారు. డాక్టర్లు ఇచ్చిన నివేదిక బయటపెట్టలేదన్నారు. చంద్రబాబుకి బోరు వాటర్ సప్లై చేస్తున్నారన్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న చంద్రబాబు.. నెల రోజుల్లో ఐదు కేజీల బరువు తగ్గారని యనమల పేర్కొన్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. చంద్రబాబు హెల్త్ రిస్క్‌లో ఉందన్నారు. ఆయనకి జైలులో ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అడ్మిట్ చేయాలని యనమల డిమాండ్ చేశారు.



# చంద్రబాబు 5 కిలోల బరువు తగ్గారు: భువనేశ్వరి

రాజమహేంద్రవరం: తెదేపా అధినేత చంద్రబాబు ఆరోగ్యం పట్ల ఆయన సతీమణి నారా భువనేశ్వరి ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబుకు అత్యవసర వైద్యం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. "జైలులో నా భర్తకు సకాలంలో వైద్యం అందించట్లేదు.

ఇప్పటికే ఆయన 5 కిలోల బరువు తగ్గారు. ఇంకా బరువు తగ్గితే కిడ్నీలపై ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు. జైలులో ఓవర్‌హెడ్ నీళ్ల ట్యాంకులు అపరిశుభ్రంగా ఉన్నాయి. చంద్రబాబు ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. జైలులో పరిస్థితులు నా భర్తకు తీవ్ర ముప్పు తలపెట్టేలా ఉన్నాయి. చంద్రబాబుకు అత్యవసరం వైద్యం అవసరం" అని తెలిపారు.

# అలాంటి వారిని ఎన్నికల్లో ఓడించటమే సరైన మందు



గుంటూరు: ప్రజా వైద్యునిగా, కళా ప్రియునిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ కాసరనేని సదాశివరావు ఎంతో సేవ చేశారని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. కాసరనేని సదాశివరావు శత జయంతి ఉత్సవాలకు వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరోపకారం కోసం జీవితాంతం కట్టుబడిన వ్యక్తి సదాశివరావు అని చెప్పుకొచ్చారు. కాసరనేని మరణానంతరం జీవించి ఉన్నారంటే వారు బతికి ఉన్నప్పుడు చేసిన పనులే కారణమన్నారు. ఇప్పటికి లక్షలాది మంది గుండెల్లో సదాశివరావు నిలిచిపోయారని.. అరుదైన రాజకీయ నాయకుల్లో కాసరనేని ఒకరు అని కొనియాడారు. నీతి, నిజాయితీ, చిత్తశుద్ధితో పని చేసేవారు రాజకీయాల్లో ఉంటే దేశం బాగుపడుతుందని తెలిపారు. విద్య, వైద్యం, రాజకీయ రంగాల్లో ఉన్నవారు చిత్తశుద్ధితో పని చేస్తే దేశం శక్తివంతం అవుతుందన్నారు. దురదృష్టవశాత్తు ప్రస్తుత రాజకీయాల్లో విలువలు గల నాయకులు తగ్గారని అన్నారు. స్థాయికి తగ్గట్లుగా నాయకులు మాట్లాడటం లేదని, తప్పుడు భాష మాట్లాడుతున్నారని వ్యాఖ్యలు చేశారు. అలాంటి వారిని ఎన్నికల్లో ఓడించటమే సరైన మందు అని చెప్పుకొచ్చారు. ప్రజలు ఆలోచించి మంచి వ్యక్తులను గెలిపించుకోవాలని సూచించారు. చదువుకున్న వారు రాజకీయాల్లో రావాలని, సేవా భావం ఉన్నవారు వైద్య వృత్తిలో ఉండాలన్నారు. ఇప్పుడు కొందరు అనవసరంగా లేని పోని వైద్య పరీక్షలు రాసి రోగి జేబులు ఖాళీ చేస్తున్నారని మండిపడ్డారు. కాసరనేని సదాశివరావు పేద రోగుల వద్ద డబ్బులు తీసుకోకుండా వైద్యం అందించారని తెలిపారు. నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా విద్యా సంస్థలను స్థాపించారని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. కాగా.. శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పలు రంగాలలో ప్రముఖులకు సన్మానం జరిగింది. కాసరనేని శత జయంతి ప్రత్యేక సంచిక సదాస్మరామి పుస్తకం, ప్రత్యేక తపాలా బిల్లను వెంకయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, మాజీ మంత్రులు వడ్డే శోభానాదీశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వల్లూరి జయ ప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.



# 24 గంటల్లో గాజాను వీడండి.. పౌరులకు ఇజ్రాయెల్ ఆదేశాలు..!

జెరూసలెం: ఇజ్రాయెల్ – హమాస్ యుద్ధం ఇప్పట్లో ఆగేలా కన్పించట్లేదు. తమ దేశంలో హమాస్ మిలిటెంట్లు సృష్టించిన మారణకాండకు ప్రతిగా గాజాపై విరుచుకుపడుతోన్న ఇజ్రాయెల్ సైన్యం.. రాబోయే రోజుల్లో వీటిని మరింత తీవ్రం చేసేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే ఉత్తర గాజాలో ఉన్న 11 లక్షల మంది పాలస్తీనా పౌరులు 24 గంటల్లో ఆ ప్రాంతాన్ని వీడాలని ఐడీఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్) ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ ఆదేశాలపై ఐక్యరాజ్య సమితి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ పరిణామాలు దారుణమైన మానవతా సంక్షోభాన్ని సృష్టిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఉత్తర గాజాలో హమాస్ ఉగ్రవాదులు టన్నెళ్లలో దాక్కొన్నారని, వారిని పట్టుకునేందుకే ఈ రీలొకేషన్ ఆదేశాలు జారీ చేశామని ఐడీఎఫ్ వెల్లడించింది. "ఉత్తర గాజాలో ఉన్న పౌరులు తమ వ్యక్తిగత భద్రత కోసం తక్షణమే దక్షిణ ప్రాంతానికి తరలిపోవాలి. 24 గంటల్లో ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయండి. మిమ్మల్ని కవచాలుగా వాడుకోవాలని హమాస్ ఉగ్రవాదులు ప్రయత్నిస్తున్నారు. వారి నుంచి దూరంగా వెళ్లండి. రాబోయే రాజుల్లో గాజా నగరంలోని హమాస్ నెట్‌వర్క్‌పై ఐడీఎఫ్ దాడులు పెంచనుంది. అమాయక పౌరులకు ఎలాటి నష్టం కలగకూడదని మేం కోరుకుంటున్నాం" అని ఐడీఎఫ్ తమ ప్రకటనలో వెల్లడించింది. అటు, ఐరాసకు ఇజ్రాయెల్ ఈ సమాచారాన్ని అందించింది. అయితే, ఈ ఆదేశాలపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. "ఇలా రీలొకేషన్ జరిగితే అత్యంత దారుణమైన మానవతా సంక్షోభం నెలకొంటుంది. గాజాలో స్కూళ్లు, క్లినిక్‌లు నడుపుతున్న ఐరాస కేంద్రాలు, సిబ్బంది కూడా అక్కడి నుంచి వెళ్లిపోవాల్సి ఉంటుంది. ఈ ఆదేశాలను వెనక్కి తీసుకోండి" అని ఐరాస సూచించింది.

**గ్రౌండ్ ఆపరేషన్ కోసమేనా..?** ఈ పరిణామాలు చూస్తుంటే గాజాలో ఇజ్రాయెల్ గ్రౌండ్ ఆపరేషన్ చేపట్టే అవకాశాలు కన్పిస్తున్నాయి. తమ దళాలు గాజాలో క్షేత్రస్థాయి యుద్ధానికి సిద్ధంగా ఉన్నాయని ఇప్పటికే ఐడీఎఫ్ కూడా ప్రకటించింది. అయితే దీనిపై ఇజ్రాయెల్ ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఒకవేళ, గ్రౌండ్ ఆపరేషన్ మొదలుపెడితే ఇజ్రాయెల్ దళాలు గాజాలోని ప్రతి ఇంటికి వెళ్లి హమాస్ మిలిటెంట్లు వెతికి మరీ మట్టుబెడతాయి. అయితే, గాజాలోని సొరంగాల నెట్‌వర్క్‌లో నక్కిన వారిని బయటకు తీసుకొచ్చి అంతం చేయడం ఇజ్రాయెల్ ముందున్న అతి పెద్ద సవాల్. మరోవైపు ఇజ్రాయెల్‌తోపాటు ఇతర దేశాలకు చెందిన పౌరులు హమాస్ వద్ద బందీలుగా ఉండటంతో వారి ప్రాణాలకు హాని కలగకుండా ఆపరేషన్ చేపట్టడం కత్తి మీద సాములాంటిదే. అయినప్పటికీ ఇజ్రాయెల్ సైన్యం గ్రౌండ్ ఆపరేషన్‌కు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.



# పరుపు కింద దాచిన నోట్ల కట్టలు రూ.42 కోట్లు పట్టివేత..!

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో ఐటీ అధికారులు భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. రూ.42 కోట్ల నగదును పట్టుకున్నారు. ఓ ఇంట్లో పరుపు కింద దాచి ఉంచిన నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి స్థానికంగా ఓ మాజీ మహిళా కార్పొరేటర్, ఆమె భర్తను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. నగల దుకాణాల యజమానులు, ఇతరుల నుంచి ఈ భారీ మొత్తాన్ని వారు సేకరించినట్లు సమాచారం. ఈ మొత్తాన్ని రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమాచారం అందుకున్న ఐటీ అధికారులు ఇవాళ బెంగళూరు నగరంలో దాడులు నిర్వహించారు. ఆర్టీ నగర్‌లోని ఆత్మానంద కాలనీలోని ఓ ఫ్లాట్‌లో తనిఖీలు చేపట్టి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. బెడ్ కింద 23 పెట్టెల్లో దాచిపెట్టిన రూ.500 నోట్ల కట్టలను అధికారులు గుర్తించి పట్టుకున్నారు. ఈ మొత్తం రూ.42 కోట్లని తేలింది. ఈ ఫ్లాట్ ఖాళీగా ఉందని, ఇక్కడ ఎవరూ నివసించట్లేదని సమాచారం. ఈ ఫ్లాట్ యజమాని ఎవరన్నది ఐటీ అధికారులు వెల్లడించలేదు. కాగా.. ఆ మాజీ కార్పొరేటర్ భర్త ఓ కాంట్రాక్టర్ అని తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి ఐటీ అధికారులు తదుపరి దర్యాప్తు చేపట్టారు.

# చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై విచారణ మంగళవారానికి వాయిదా



దిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో వాదనలు శుక్రవారం వాడీవేడిగా కొనసాగాయి. ఈ కేసులో సెక్షన్ 17ఏ వర్తిస్తుందని చంద్రబాబు తరఫు న్యాయవాది వాదించగా.. ఆ సెక్షన్ వర్తించదని సీఐడీ తరఫు న్యాయవాది వాదించారు. ఇరువైపులా సుదీర్ఘ వాదనలు విన్న జస్టిస్ అనిరుద్ధబోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేది ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 17 (మంగళవారం) మధ్యాహ్నం 2గంటలకు వాయిదా వేసింది. చంద్రబాబు తరఫు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ స్కిల్ కేసు విచారణకు ఫైబర్‌నెట్ కేసుతో సంబంధం ఉందన్నారు. మరో కేసులో చంద్రబాబును 16న ప్రవేశపెట్టేందుకు వారెంట్ తీసుకున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. కేసులపై కేసులు పెట్టి తమను సర్కస్ ఆడిస్తున్నారని వెల్లడించారు. ఇక్కడ కూడా 17ఏను ఛాలెంజ్ చేస్తున్నారా? అని లూథ్రాను జస్టిస్ త్రివేది ప్రశ్నించగా.. అవును 17ఏ ప్రతిచోటా వర్తిస్తుందని లూథ్రా తెలిపారు. సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. చట్టాన్ని రద్దు చేసినా, వెనక్కి తీసుకున్నప్పటికీ నేరం జరిగినప్పుడు ఉన్న చట్టమే వర్తిస్తుందన్నారు. కొత్త చట్టం అమలులోకి రాకముందే నేరం జరిగింది కాబట్టి సవరణ చట్టం ఈ కేసుకు వర్తించదన్నారు. "అసలు ఎంక్వయిరీ విషయంలోనే నిరోధం ఉన్నప్పుడు కేసులు ఎలా ఫైల్ చేస్తారు? ఎంక్వయిరీ లేదా ఎంక్వరీ మీద నిరోధం ఉన్నప్పుడు పోలీసు అధికారి కేసు పెట్టాలని ఎలా నిర్ణయిస్తారు? పోలీసు అధికారికి కేసు నమోదు చేసే అధికారం లేనప్పుడు ఎలా కేసు నమోదు చేస్తారు?" అని జస్టిస్ బోస్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా సీఐడీ తరఫు న్యాయవాది రోహత్గీ స్పందిస్తూ.. ఎఫ్ఐఆర్ రద్దు చేయాలన్న అంశంపై ఎంసీ గుప్తా కేసును ప్రస్తావించారు. చట్టం అమలులో ఉన్నప్పుడు జరిగిన నేరాలకు అదే చట్టం వర్తిస్తుందని వాదించారు. "అధికార విధులు నిర్వర్తించడమంటే అవినీతికి పాల్పడటం కాదు కదా? అధికార విధుల నిర్వహణ ముసుగులో అవినీతికి పాల్పడే పరిస్థితి ఉండ కూడదు" అని రోహత్గీ వాదించారు. చట్ట సవరణ తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.. కేసు పాతదే అంటారు అంతేనా? అని ఈ సందర్భంగా జస్టిస్ త్రివేది వ్యాఖ్యానించారు. చట్టసవరణ ముందు కేసు కాబట్టే 17ఏ వర్తించదని నా వాదన అని రోహత్గీ తెలిపారు. "17ఏ అనేది పుట్టకముందే నేరం జరిగింది కాబట్టి ఈకేసుకు చట్టసవరణ వర్తించదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. 2018 జులైలో చట్ట సవరణ జరిగింది.. 2014, 2015 కేసులకు బెనిఫిట్ డౌట్ కింద పరిగణించలేము కదా?. 17ఏ అన్నది అవినీతికి రక్షణ కాకూడదు. అవినీతి పరులను రక్షించేందుకు 17ఏ చట్టసవరణ పరికరం కాకూడదు. సెక్షన్ 19 మాదిరిగా 17ఏ సంపూర్ణంగా కేసు నమోదుకు నిరోధం కల్పించలేదు. ఈ చట్టం వచ్చింది భవిష్యత్‌లో నిజాయతీ పరులైన అధికారులకు ఇబ్బంది తలెత్తకుండా ఉండటం కోసమే" అని రోహత్గీ వాదించారు.

# కోడికత్తి కేసు.. సీఎం జగన్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా



అమరావతి: కోడికత్తి కేసులో సీఎం జగన్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ఈ నెల 17కు వాయిదా పడింది. పిటిషన్‌కు నంబర్ ఇవ్వాలని రిజిస్ట్రీని న్యాయస్థానం ఆదేశించింది. విశాఖ విమానాశ్రయంలో తనపై కోడికత్తితో దాడి ఘటన కేసులో.. లోతైన దర్యాప్తు కోసం చేసిన అభ్యర్థనను ఎన్ఐఏ కోర్టు తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ సీఎం జగన్ హైకోర్టును ఆశ్రయించారు. కోడికత్తితో తనపై జరిగిన దాడిలో కుట్ర కోణం ఉందని, లోతైన దర్యాప్తు జరపాలని విజయవాడలోని ఎన్ఐఏ కోర్టులో (సాక్షుల విచారణకు షెడ్యూల్ ప్రకటించి, వాంగ్మూలాల నమోదు దశలో) జగన్ పిటిషన్ వేశారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోకుండానే ఎన్ఐఏ అభియోగపత్రం దాఖలు చేసిందని పేర్కొన్నారు. నిందితుడు శ్రీనివాసరావుకు నేర చరిత్ర ఉన్నా ఆ విషయాన్ని పట్టించుకోకుండా క్యాంటిన్ నిర్వాహకుడు విధుల్లోకి తీసుకున్నారన్నారు. కుట్ర కోణం తేల్చేందుకు మరింత లోతైన విచారణ జరపాలని కోరారు. ఎన్ఐఏ కోర్టు జులై 25న ఈ పిటిషన్‌ను కొట్టివేయడంతో జగన్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది.

# లేడీ సూపర్ స్టార్ కవర్ ఫోటోలతో కవ్వింపులు

లేడీ సూపర్ స్టార్ నయనతార ఒకప్పుడు సోషల్ మీడియాలో పెద్దగా కనిపించేది కాదు. ఆమె పర్సనల్ అకౌంట్స్ తో పాటు ఇతరులు కూడా ఆమె ఫోటోలు షేర్ చేసేందుకు వీలు ఉండేది కాదు. కానీ ఇప్పుడు నయనతార ఫోటో షూట్స్ విషయంలో తన మనసు మార్చుకుని కుమ్మేస్తోంది. ఈ మధ్య కాలంలో ఈ అమ్మడి అందాల ఆరబోత హాట్ ఫోటో షూట్స్ తెగ వైరల్ అవుతున్నాయి. నయనతార తన ప్రియుడు విఘ్నేష్ శివన్ ని పెళ్లి చేసుకుని ఇద్దరు పిల్లలకు తల్లిగా లైఫ్ ను ఎంజాయ్ చేస్తోంది. మరో వైపు హీరోయిన్ గా కూడా సినిమాలు కంటిన్యూ చేస్తోంది. ఇక రెగ్యులర్ గా హాట్ ఫోటో



షూట్స్ తో ఈ అమ్మడు తెగ రెచ్చి పోతుంది. తాజాగా ఎల్లి అనే మ్యాగజైన్ కోసం కవర్ పేజీ కి ఫోటో షూట్ ను ఇవ్వడం జరిగింది. ఎల్లి ఫోటో షూట్ లో నయనతార కవ్విస్తోంది. పెద్దగా స్కిన్ షో చేయకున్నా కూడా చేసిన కొంతలో కొంతతోనే అభిమానులు మరియు నెటిజన్స్ తెగ మురిసిపోతున్నారు. ఈ రేంజ్ లో నయనతార ను చూస్తామని అనుకోలేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తుంటే.. నయనతార లో ఈ మార్పు రావడం చాలా ఆనందంగా ఉందని అభిమానులు అంటున్నారు. ఇటీవలే హిందీ మూవీ జవాన్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ఏకంగా వెయ్యి కోట్ల వసూళ్లు సాధించి రికార్డులను బ్రేక్ చేసింది. బాలీవుడ్ తో పాటు కోలీవుడ్ లో కూడా ఈ అమ్మడు జోరు కంటిన్యూ చేస్తుంది. వరుసగా సినిమాలు చేస్తూ కెరీర్ లో దూసుకు పోతుంది. తెలుగు సినిమా లు ఈ మధ్య కాలంలో కమిట్ అవ్వని నయనతార ముందు ముందు ఏమైనా తెలుగు సినిమా లకు కమిట్ అయ్యేనా చూడాలి.

# జెబ్బల గౌనులో హృదయం జారేలా అనికా!

చైల్డ్ ఆర్టిస్ట్ గా తెరంగేట్రం చేసిన అనికా సురేంద్రన్ పరిచయం అవసరం లేని పేరు. ఇప్పుడా చైల్డ్ ఆర్టిస్ట నెట్టింట ఎంత ఫేమస్ అన్నది చెప్పాల్సిన పనిలేదు. 18 ప్రాయంలోకి అడుగు పెట్టిన అనికా హీరోయిన్లకు నేనేం తీసిపోను అని చాటి చెబుతుంది. ఎప్పటికప్పుడు న్యూలుక్ తో ఆకట్టుకుంటుంది. కొత్త ఫోటో షూట్లతో కుర్రాళ్లలో కాకలు పుట్టిస్తుంది. ఇంకా పూర్తి స్థాయిలో అందాల ఆరబోతకు రెడీ కాలేదు కానీ.. అమ్మడు మాత్రం అందుకు సంసిద్ధంగానే ఉంది. స్కిన్ షోకి..గ్లామర్ షోకి పర్ఫెక్ట్ టైమ్ రావాలని చూస్తుంది. తాజాగా బ్యూటీ నుంచి మరో న్యూపిక్ లీకైంది. ఇదిగో ఇక్కడిలో తెలుపు రంగు జెబ్బల గౌనులో గుభాళించింది. బ్యాక్



గ్రౌండ్..అనికా స్కిన్ టోన్ ఒకే రంగులో ఉన్నాయి. ఆ బ్యూటీపై తెలుగు గౌనులో మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. క్యూట్ స్మైల్ ముఖాన్ని మరింత ప్రకాశవంతంగా మలిచింది. హెయిర్ స్టైల్... మ్యాకప్ ..చెవిపోగులు అమ్మడిని మరింత అందంగా ఫోకస్ చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. అనికా అందానికి కుర్రకారు ఫిదా అవుతున్నారు. మా హృదయం జారిందం టూ కామెంట్లు పెడుతున్నారు. ఇక అనికా కెరీర్ సంగతి చూస్తే చేతిలో చాలా సినిమాలున్నాయి. కానీ అవేవి హీరోయిన్ ఛాన్సులు కాదు. సినిమాల్లో కేవలం కీలక పాత్రలు మాత్రమే. మరి అమ్మడినిక హీరోయిన్ గా ఎందుకు కన్సిడర్ చేయడం లేదు? అన్నది ఆసక్తికరం. అనికాకి ఇంకా హీరోయిన్ అయ్యే వయసు రాలేదని పరిశ్రమ భావిస్తుంది. 18 ఏళ్లతో మేజర్ అయినా పరిశ్రమ ఇంకా ఆ బ్యూటీని చిన్న పిల్లగానే ట్రీట్ చేస్తున్నట్లు కనిపిస్తుంది. ఇటీవలే ధనుష్ 50వ చిత్రంలోనూ ఎంపికైంది. ఇందులోనూ అదే పరిస్థితి. మరి ఈ బ్యూటీని మెయిన్ లీడ్ లో పెట్టి ఏ దర్శకుడు సినిమా చేస్తాడు? అన్నది చూడాలి. మరోవైపు తానింకా చిన్న పిల్లని కాదని సామాజిక మాధ్యమాల వేదికగా చెప్పే ప్రయత్నం కొనసాగుతూనే ఉంది.




# మెగా హీరోతో శ్రీలీల.. అదిరిపోయే స్టెప్పులు




పంజా వైష్ణవ్ తేజ్ – యంగ్ సెన్సేషనల్ బ్యూటీ శ్రీలీల జంటగా నటిస్తున్న లేటెస్ట్? మూవీ ఆదికేశవ. ఈ సినిమా మరి కొన్ని రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సినిమా నుంచి 'హే బుజ్జి బంగారం' లిరికల్ వీడియోను తాజాగా చిత్ర బృందం విడుదల చేసింది. ఈ పాట వింటుంటే ఎంతో రిఫ్రెషింగ్?గా ఉంది. శ్రీలీల పంజా వైష్ణవ్ తేజ్ డ్యాన్స్ మూమెంట్స్ కూడా బాగున్నాయి. లిరిక్స్ కూడా కచ్చితంగా ప్రతిఒక్కరి రొమాంటిక్ ప్లేలిస్ట్‌లో ఉండేలా ఉన్నాయి. జీవీ ప్రకాశ్? అందించిన మ్యూజిక్ రొమాంటిక్ ఫీల్, ఫ్రెష్ వైబ్స్ అందించాయి. ఆర్మాన్ మాలిక్–యామిని ఘంటశాల అద్భుతంగా ఆలపించారు. సరస్వతి పుత్ర రామజోగయ్యా శాస్త్రి అందించిన లిరిక్స్ ఎమోషన్స్‌ను ఎక్స్‌ప్రెస్ చేసేలా మంచి మీనింగ్ ఫుల్‌గా ఉన్నాయి. సినిమాలోని లొకేషన్స్ కూడా అద్భుతంగా ఉన్నాయి. అంతేకాకుండా పాట చాలా కలర్‌ఫుల్‌గా కనిపిస్తుంది. ఆదికేశవ టీమ్.. సాంగ్స్, టీజర్స్ అందించిన రెస్పాన్స్‌తో సినిమా పక్కాగా బ్లాక్ బాస్టర్ హిట్ అవుతుందని కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. ప్రేక్షకులు బాగా ఆదరిస్తారని నమ్ముతున్నారు. ఇకపోతే యాక్షన్ నేపథ్యంలో డైరెక్టర్ శ్రీకాంత్ ఎన్. రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రంతో ఆయన దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. ఓ గుడి చుట్టూ సాగే కథతో రూపొందిన చిత్రమిది. వైష్ణవ్‌తేజ్.. రుద్ర కాళేశ్వర్ రెడ్డిగా శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో వైష్ణవ్ సరసన శ్రీలీల సందడి చేయనుంది. మలయాళ యాక్టర్ జోజు జార్జ్, అపర్ణాదాస్, రాధిక తదితరులు కీలక పాత్రలు పోషించారు. సితార ఎంటర్‌టైన్మెంట్స్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు చూసుకుంటున్నారు. సినిమా దీపావళి కానుకగా నవంబర్ 10న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఇకపోతే వైష్ణవ్ తేజ్ చివరగా.. రంగరంగ వైభవంగా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. మరి ఆదికేశవ ఎలాంటి రిజల్ట్?ను అందుకుంటుందో చూడాలి..

# వారసుడితో ఇలియానా అల్లిబిల్లి ఆటలు



ఇలియానాలో ఆనందం ఆవర్ణమైంది. ఇలాంటి ఆనందం కనీవినీ ఎరుగనిది. తనలో ఎన్నడూ చూడనిది. గడిచిన చాలా కాలంగా ఇలియానా రకరకాల ఒత్తిళ్లకు లోనైంది. డిప్రెషన్ ని ఎదుర్కొని దాని నుంచి బయటపడేందుకు చాలా సమయం తీసుకుంది. ఎట్టకేలకు ఇప్పుడు తన జీవితంలో ఎంతో గొప్ప ఆనందక్షణాలను ఆస్వాధిస్తోంది. దీనికి కారణం తన జీవితంలోకి వచ్చిన ఆ పండంటి తొలిచూరు బిడ్డడు. ఇలియానా నిజానికి తన భర్తను పరిచయం చేయకుండానే, ఫ్రెగ్నెన్సీ గురించి ప్రకటించి ఆశ్చర్యపరిచింది. తరువాత తన భర్తను దాచిపెట్టి కొన్నాళ్లకు ఫోటో షేర్ చేసింది. ఇటీవల మగబిడ్డను ప్రసవించింది. బాలకుడు నట్టింటికి వచ్చి ఇప్పటికే రెండు నెలలకు పైగా అయింది. కోవా ఫీనిక్స్ డోలన్ అని పేరు కూడా పెట్టుకుంది. ఇటీవల చిన్నారి కోవా ఫోటోలు అంతర్జాలంలో వైరల్ అవుతున్నాయి. తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ఇలియానా చిన్నారి కోవాతో ఆడుకుంటున్న ఫోటోలను పోస్ట్ చేయగా అవి వైరల్ గా మారాయి. ఇలియానాలోని ఈ ఆనందం చూశాక పరిశ్రమ సన్నిహితులు ప్రశంసిస్తున్నారు. తనపై ప్రేమను కురిపిస్తున్నారు. మలైకా, అథియా శెట్టి, నర్గీస్ ఫక్రీ తదితర స్నేహితులు లవ్ ఈమోజీల్ని షేర్ చేసారు. ఇలియానా మైఖేల్ డోలన్‌ను 13 మే 2023న ప్రచారార్భాటానికి దూరంగా వివాహం చేసుకుంది.

తన పెళ్లి విషయాన్ని దాచి పెట్టింది. గర్భం దాల్చడానికి నాలుగు వారాల ముందు ఈ జంట వివాహం జరిగిందని కథనాలొచ్చాయి. ఇటీవల తన వారసుడితోనే ఎక్కువ సమయం గడుపుతున్న ఇలియానా నటనకు చిన్నపాటి విరామం తీసుకుంది. గోవా బ్యూటీ చివరిసారిగా 'సబ్ గజాబ్..' అనే మ్యూజిక్ వీడియోలో కనిపించింది. అభిషేక్ బచ్చన్ నటించిన 'ది బిగ్ బుల్' 2021లో విడుదలైంది. స్టాక్ బ్రోకర్ హర్షద్ మెహతా ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో ఇలియానా నటనకు మంచి పేరొచ్చింది. ఇప్పుడు అన్‌ఫెయిర్ %ఊ% లవ్లీ – లవర్స్ చిత్రాలలో నటిస్తోంది. లవర్స్ చిత్రంలో ప్రతీక్ గాంధీ – విద్యాబాలన్ లతో కలిసి తెరపై కనిపించనుంది.

# హీరోయిన్ కి విమానంలో వేధింపులు

ఆడవారి పై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షిస్తున్నా కూడా ఫలితం ఉండటం లేదు. ప్రతి రోజు ఏదో ఒక చోట ఏదో ఒక రూపంలో వందలాది మంది అమాయకపు ఆడవారు లైంగిక వేధింపులు ఎదుర్కొంటూనే ఉన్నారు. ఆడవారిపై అఘాయిత్యాలు తగ్గించేందుకు పోలీసులు ఎంత కఠినంగా వ్యవహరించిన కూడా.. కోర్టులు కఠిన శిక్షలు వేస్తున్నా కూడా అలాంటి సంఘటనలు పునరావృతం అవుతూనే ఉన్నాయి. సాధారణ అమ్మాయిలు, ఆడవారికి మాత్రమే కాకుండా సెలబ్రెటీలకు, హీరోయిన్స్ కి కూడా లైంగిక వేదింపులు తప్పడం లేదు. ఇండస్ట్రీలో చాలా మంది తాము లైంగిక వేధింపులు ఎదుర్కొన్నాను అంటూ ఉంటారు. అయితే



హీరోయిన్ దివ్య ప్రభ తనను ఒక వ్యక్తి విమానంలో ప్రయాణిస్తున్న సమయంలో లైంగికంగా వేధించాడు అంటూ పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడం చర్చనీయాంశం అయింది. సంఘటన పూర్తి వివరాల్లోకి వెళ్తే... మలయాళ నటి దివ్య ప్రభ అక్టోబర్ 10వ తారీకు ఎయిర్ ఇండియా విమానంలో ముంబై నుంచి కొచ్చి కి ప్రయాణించింది. ఆ సమయంలో పక్క సీటులో ఉన్న వ్యక్తి తాగి ఉన్నాడట. హీరోయిన్ దివ్య ప్రభతో అతడు అసభ్యంగా ప్రవర్తించాడు. అంతే కాకుండా ఆమెను అవమానకరంగా మాట్లాడట. ఆ విషయాన్ని దివ్య ప్రభ వెంటనే ఎయిర్ హెూస్టెస్ కి చెప్పగా సీటు మార్చిందట. ఆ తర్వాత కొచ్చి ఎయిర్ పోర్ట్ సిబ్బందికి ఫిర్యాదు చేస్తే కూడా వారు సరిగా పట్టించుకోలేదట. దాంతో దివ్య ప్రభ ఈమెయిల్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని స్వయంగా సోషల్ మీడియా ద్వారా దివ్య ప్రభ చెప్పుకొచ్చింది. ప్రయాణికుల భద్రత పట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎయిర్ ఇండియా వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు తనపై అసభ్యంగా లైంగిక వేదింపులకు పాల్పడ్డ వ్యక్తిని కఠినంగా శిక్షించాలంటూ ఆమె డిమాండ్ చేస్తోంది.

కేసు నమోదు చేసిన పోలీసులు ఎంక్వైరీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసు చివరకు ఎటు వెళ్తుందో చూడాలి.

# నిహారిక మాయ చేసే నవ్వుతో!

నిహారిక కొణిదెల ఈ పేరు గురించి తెలుగు వారికి కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. మెగాడాటర్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ.. నటిగా మంచి గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఓ వైపు నటిస్తూనే.. మరోవైపు నిర్మాతగా రాణిస్తోంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ.. అదిరిపోయే హాట్ ఫొటోషూట్‌లో కనువిందు చేసి సెగలు పుట్టించింది. వివరాల్లోకి వెళితే.. 'ఒక మనసు' చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన నిహారిక.. 'హ్యాపీ వెడ్డింగ్', 'సూర్యకాంతం' వంటి చిత్రాలతో అలరించేందుకు ప్రయత్నాలు చేసింది. కానీ పెద్దగా ఆకట్టుకోలేదు. ఆ తర్వాత ఆమె నటించిన వెబ్ సిరీస్ ముద్ద పప్పు ఆవకాయ మాత్రం మంచి ఆదరణ పొందడంతో ప్రేక్షకులకు కాస్త దగ్గరైంది. కెరీర్?లో సాఫీగా సాగుతున్న



సమయంలో పెళ్లి చేసుకుని కొంత కాలం సినిమాలకు దూరమైంది. అయినా నిర్మాతగా చిత్రాలను నిర్మించింది. ఆ తర్వాత పర్సనల్? లైఫ్?లో డివోర్స్ తీసుకుని మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అనంతరం మళ్లీ కెరీర్‌పై ఫోకస్ పెట్టింది. రీసెంట్‌గా 'డెడ్ పిక్సెల్స్' అనే సిరీస్?తో ఆడియెన్స్‌ను పలకరించింది. ఇదే సమయంలో సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్?గా ఉంటోంది ఫొటోలను షేర్ చేస్తోంది. లైఫ్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తోంది. అయితే సినిమాల్లో చాలా వరకు ట్రెడిషనల్‌గా కనిపించే ఈ భామ.. బయట మాత్రం ఫుల్ ట్రెండీగా దర్శనమిస్తోంది. తాజాగా మరో కొత్త ఫొటోషూట్‌తో కాస్త హీట్ పెంచింది. ఆరెంజ్ కలర్ ఆఫ్ షోల్డర్ లాంగ్ స్లీవ్ స్వెటర్ ధరించి అందాలను ఆరబోసింది. ఒడిలో దిండు పెట్టుకుని నవ్వుతూ పోజులు ఇచ్చింది. ఆ పిక్స్ నెటిజన్లను బాగా ఆకట్టుకున్నాయి.

ప్రస్తుతం నిహారిక.. తన అన్న వరుణ్ తేజ్ పెళ్లి పనుల్లో బిజీగా ఉంటుంది. ఫ్యామిలీతో కలిసి ఎక్కువగా టైమ్ స్పెండ్ చేస్తోంది. వాటికి సంబంధించిన విషయాలను పంచుకుంటోంది. ఇకపోతే ఈమె.. ఓ యువ హీరో సరసన నటించనుందని టాక్ వినిపిస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు బయటకు రానున్నాయి. చూడాలి మరి సెకండ్స్ ఇన్నింగ్స్‌లోనైనా మెగా డాటర్ ఎలాంటి రిజల్ట్‌ను అందుకుంటోందో..



# ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం..
# ఆ సైరన్ల శబ్దం ఇంకా చెవుల్లో మార్మోగుతోంది..!

దిల్లీ: ఇజ్రాయెల్ సేనలు, హమాస్ ఉగ్రవాదుల మధ్య భీకర పోరు కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో చిక్కుకున్న భారతీయులను వెనక్కి తీసుకొచ్చే 'ఆపరేషన్ అజయ్' ప్రారంభమైంది. ఇందులో భాగంగా 200 మందికి పైగా భారతీయుల్ని తీసుకుని టెల్ అవీవ్ నుంచి ప్రత్యేక విమానం శుక్రవారం తెల్లవారుజామున దిల్లీ చేరుకుంది. యుద్ధ కల్లోలం నుంచి బయటపడి క్షేమంగా స్వదేశానికి చేరుకోవడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇజ్రాయెల్ నుంచి స్వదేశానికి వచ్చిన భారత పౌరులకు దిల్లీ ఎయిర్‌పోర్టులో కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్వాగతం పలికారు. వారిని ఆప్యాయంగా హత్తుకున్నారు. తొలి బ్యాచ్‌లో మొత్తం 212 మంది భారతీయులను వెనక్కి తీసుకున్నారు. వీరిలో కొందరు విద్యార్థులు కూడా ఉన్నారు. 'ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్' ఆధారంగా వీరిని స్వదేశానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా యుద్ధం సమయంలో ఎదుర్కొన్న భయానక అనుభవాలను వారు పంచుకున్నారు. "అక్కడ సాధారణ పరిస్థితులనేవే లేవు. ఆ రోజు ఎయిర్ రెయిడ్ సైరన్ల మోతతో మేం నిద్రలేచాం. ఏం జరుగుతుందో తెలిసేలోపే కొన్ని చోట్ల రాకెట్ల వర్షం కురిసింది. దీంతో ఇజ్రాయెల్ అధికారులు మమ్మల్ని సమీపంలోని షెల్టర్లలోకి వెళ్లమన్నారు. ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. మేం బయల్దేరే సమయంలో కూడా సైరన్లు మోగుతూనే ఉన్నాయి. ఆ సైరన్ల మోత ఇంకా మా చెవుల్లో మార్మోగుతూనే ఉంది. ఆ భయానక పరిస్థితులను వర్ణించలేం. మమ్మల్ని క్షేమంగా స్వదేశానికి తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం" అని వారు తెలిపారు. భారత రాయబార కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇజ్రాయెల్‌లో దాదాపు 18వేల మంది భారతీయులున్నారు. వారిలో దాదాపు 14వేల మంది కేర్‌టేకర్లే. వీరితోపాటు విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, వజ్రాల వ్యాపారులు తదితరులున్నారు. వీరిని వెనక్కి తీసుకొచ్చేందుకు భారత్ 'ఆపరేషన్ అజయ్' ప్రారంభించింది. వీరి ప్రయాణ ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరించనుంది.

## మంత్రి వేముల మాతృమూర్తి మంజులమ్మ భౌతిక కాయానికి సీఎం కేసీఆర్ నివాళులు



హైదరాబాద్: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి మంజులమ్మ భౌతిక కాయానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు నివాళులర్పించారు. నిజామాబాద్ జిల్లా వేల్పూరులోని మంత్రి నివాసానికి వెళ్లి మంజులమ్మ భౌతిక కాయానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మంత్రి వేములను, ఆయన కుటుంబసభ్యులను సీఎం పరామర్శించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ వెంట స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, మంజులమ్మ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు సీఎం కేసీఆర్ ఇవాళ ఉదయం ప్రగతిభవన్ నుంచి వేల్పూర్‌కు చేరుకున్నారు. మంత్రి వేముల మాతృమూర్తి మంజులమ్మ (77) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు. మంజులమ్మకు గతంలో బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ జరిగింది. ఆ తర్వాత కోలుకున్నప్పటికీ మళ్లీ ఆరోగ్యం క్షీణించడంతో మృతిచెందారు.

## కాంగ్రెస్ పార్టీ ఎన్ని డబ్బులు పంచినా.. గెలిచేది మాత్రం బీఆర్ఎస్ పార్టీనే : మంత్రి హరీశ్‌రావు



మెదక్ : తెలంగాణ ఎన్నికల్లో డబ్బు పంచి గెలించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమంగా సంపాదించిన డబ్బును తెలంగాణకు చేరవేస్తోందని ఆయన ఆరోపించారు. ఆ రాష్ట్ర రాజధాని బెంగళూరులో జరిగిన ఐటీ దాడుల్లో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితుడైన అంబికా పతి, ఆయన భార్య అశ్వత్త ఇంట్లో రూ. 52 కోట్లు పట్టుబడ్డాయని మంత్రి తెలిపారు. కర్ణాటకలో గతంలో అధికారంలో ఉన్న బీజేపీ కాంట్రాక్టర్ల వద్ద 40 శాతం కమీషన్ వసూలు చేస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ 50 శాతం వసూలు చేస్తుందని మంత్రి ఆరోపించారు. ఇలా కాంగ్రెస్ పార్టీ స్కాంగ్రెస్‌గా మారిందని మండిపడ్డారు.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ టికెట్‌లు అమ్ముకొంటున్నట్టు ఆ పార్టీ నేతలే ఆరోపిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎన్ని నోట్ల కట్టలు పంచినా, ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో ముచ్చటగా మూడోసారి గెలిచేది బీఆర్ఎస్ పార్టీనే అని మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.

## హైదరాబాద్ సీపీగా సందీప్ శాండిల్య నియామకం



హైదరాబాద్ : హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా సందీప్ శాండిల్య నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సందీప్ శాండిల్య పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈసీ ఆదేశాలకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రం పంపిన ప్యానల్ నుంచి అధికారులను ఈసీ ఎంపిక చేసింది. యాదాద్రి కలెక్టర్‌గా హనుమంత్, నిర్మల్ కలెక్టర్‌గా ఆశీష్ సంగ్వాన్, రంగారెడ్డి కలెక్టర్‌గా భారతీ హోలీకేరి, మేడ్చల్ కలెక్టర్‌గా గౌతం, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శిగా వాణీ ప్రసాద్, ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్యకార్యదర్శిగా సునీల్ శర్మ, ఎక్సైజ్ కమిషనర్‌గా జ్యోతి బుద్ధ ప్రకాశ్, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా క్రిస్టినా నియామకం అయ్యారు.

**పోలీసు కమిషనర్లు, ఎస్పీల జాబితా..** 1. అంబర్ కిషోర్ ఝా - వరంగల్ పోలీసు కమిషనర్ 2. కల్మేశ్వర్ సింగేనేవర్ - నిజామాబాద్ పోలీసు కమిషనర్ 3. చెన్నూరి రూపేశ్ - సంగారెడ్డి ఎస్పీ 4. సింధూ శర్మ - కామారెడ్డి ఎస్పీ 5. సంప్రీత్ సింగ్ - జగిత్యాల ఎస్పీ 6. హర్షవర్ధన్ - మహబూబ్‌నగర్ ఎస్పీ
7. వైభవ్ రఘునాథ్ - నాగర్‌కర్నూల్ ఎస్పీ 8. రితిరాజ్ - జోగులాంబ గద్వాల్ ఎస్పీ 9. పాటిల్ సంగ్రామ్ సింగ్ గణపతి రావ్ - మహబూబాబాద్ ఎస్పీ 10. యోగేశ్ గౌతమ్ - నారాయణపేట ఎస్పీ 11. కిరణ్ ప్రభాకర్ - భూపాలపల్లి ఎస్పీ 12. రాహుల్ హెగ్డే - సూర్యాపేట ఎస్పీ

వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాల్లో సీనియర్ అధికారులను కేంద్ర ఎన్నికల కమిషన్ బదిలీ చేసిన సంగతి తెలిసిందే. బదిలీ అయినవారిలో తొమ్మిది మంది జిల్లా కలెక్టర్లు, 25 మంది పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, అదనపు ఎస్పీలు ఉన్నారు. ఇందులో తెలంగాణలో రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నిర్మల్ జిల్లాల కలెక్టర్లతోపాటు 13 మంది పోలీసు అధికారులు ఉన్నారు.

## పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారు

దుబ్బాక: సిద్దిపేట జిల్లా పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం నాడు దుబ్బాకలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.."నేను అధికార పార్టీ నేతలపై ఫిర్యాదు చేస్తే... BRS నేతల ద్వారా బీజేపీ నేతలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టె కుట్ర చేస్తున్నారు.

నేను రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. BRS నేతల ద్వారా మాపై ఎస్సీ, ఎస్టీ అక్రమ కేసులు పెడుతున్నారు. సిద్దిపేట సీపీ శ్వేత, ఏసీపీపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాం. అవినీతి కేసులో ఉన్న మంత్రి హరీశ్‌రావు ఓఎస్డీ AY గిరి ఎన్నికల ఉల్లాంగణలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ వాహనంలో వచ్చి డబ్బులను ఓఎస్డీ పంచుతున్నారు. సిద్దిపేట కలెక్టర్ ఆఫీస్‌లో కల్యాణలక్ష్మి చెక్‌లు పంచుతూ డబ్బులు వసూలు చేస్తున్నారు.

సిద్దిపేట జిల్లాకు చెందిన నలుగురు అధికారులపై ఎలక్షన్ కమిషన్ అధికారులకు ఫిర్యాదు చేశాం. ఉపఎన్నికల్లో నన్ను ఎంత టార్చర్ చేశారో అందరికీ తెలుసు" అని రఘునందన్‌రావు పేర్కొన్నారు.

## తెలంగాణ అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం : మంత్రి గంగుల

కరీంనగర్ : బీఆర్ఎస్ పార్టీనే మా భవిష్యత్తు అని ప్రజలు నమ్ముతున్నారు. వ్యవసాయానికి పనికిరాని భూములు ఇప్పుడు కాళేశ్వరం నీటితో కలకలాడుతున్నాయి. కరువు నుంచి అద్భుతమైన పంటలు పండే రోజులు వచ్చాయని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రా వాళు కాంగ్రెస్, బీజేపీ ముసుగుతో వచ్చి తెలంగాణను మళ్లీ ఆంధ్రాలో కలపాలని చూస్తున్నారు. తెలంగాణ యువత భవిష్యత్తను కాపాడేది కేసీఆర్ మాత్రమే అన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ వస్తే ఇంకా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ఆంధ్రా ముసుగులో లీడర్లు వస్తున్నారు, నమ్మవద్దు. యువత భవిష్యత్తు బాగుండాలంటే కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. కరీంనగర్ ఇంకా అభివృద్ధి చెందాలంటే మరొక అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఈటెల రాజేందర్ భయపడే హుజురాబాద్ లోనూ పోటీ చేస్తాను అంటున్నారు. బండి సంజయ్ గంజాయి ఆరోపణలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. గంజాయిని ఎవరైనా ప్రోత్సహిస్తారా? కరీంనగర్ గంజాయి రహితంగా ఉండాలని సీపీకి ఇంతకు ముందే చెప్పామని గుర్తు చేశారు. సర్వేలన్నీ మాకే అనుకూలంగా ఉన్నాయి. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో విఫలం అయిందని విమర్శించారు. కర్ణాటకలో పథకాలు అమలు చెయడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఆరు గ్యారంటీలు ఎలా చేస్తారని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఒక్క సీటు కూడా వచ్చే అవకాశం లేదు. ఈటెల సీఎం ఎలా అవుతాడని ప్రశ్నించారు.



# హమాస్‌కు పాలుపోసి పెంచిన ఇజ్రాయెల్!

## అరాఫత్‌కు వ్యతిరేకంగా ప్రోత్సహించిన యూదులు - ఇప్పుడు బాధపడుతున్న దేశం

శత్రువుకు శత్రువు మిత్రుడు.. ఈ సూత్రం ఆధారంగానే హమాస్‌కు చేయూతనిచ్చింది ఇజ్రాయెల్. పాలస్తీనా ఏర్పాటు లక్ష్యంగా 1950ల చివర్లో ఏర్పడ్డ ఫతా అనే సంస్థ ఇజ్రాయెల్‌పై సాయుధ దాడులకు సిద్ధమైంది. దీని అధిపతి యాసర్ అరాఫత్. తర్వాతి కాలంలో ఆయన సారథ్యంలోనే అనేక అరబ్ గ్రూపులు కలిసి పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్‌గా (పీఎల్‌వో) ఏర్పడ్డాయి. ఇది మత ఛాందస సంస్థ కాదు. లౌకిక జాతీయవాద, వామపక్ష సంస్థ. 1969లో పీఎల్‌వో ఛైర్మన్ అయిన అరాఫత్ 2014లో చనిపోయేదాకా ఆ పదవిలో ఉన్నారు. మొదట్లో సాయుధ బాటలో ఇజ్రాయెల్‌కు ఇబ్బందులు సృష్టించింది పీఎల్‌వో. అంతేగాకుండా అంతర్జాతీయ సమాజం ముందు పాలస్తీనా గళాన్ని బలంగా వినిపించింది.

అరబ్‌లీగ్‌తో పాటు, ఐక్యరాజ్య సమితి పీఎల్‌వోను పాలస్తీనీయుల చట్టబద్ధ ప్రతినిధిగా గుర్తించాయి. అలా ఇజ్రాయెల్‌కు అరాఫత్, పీఎల్‌వోలు కంట్లో నలుసు గా మారాయి. దీంతో ఈ పీఎల్‌వో, అరాఫత్‌ను బలహీన పరచాలని ఇజ్రాయెల్ ఆలోచించింది.

**అరాఫత్‌పై కోపంతో..** ఈ క్రమంలో వారికి గాజాలో కనిపించిన వ్యక్తి షేక్ అహ్మద్ యాసిన్. 1966 దాకా గాజా ప్రాంతం ఈజిప్టు పాలనలో ఉంది. 1967లో జరిగిన అరబ్, ఇజ్రాయెల్ యుద్ధంతో పరిస్థితి మారింది. యుద్ధంలో ఇజ్రాయెల్ నెగ్గటంతో గాజా వారి వశమైంది. ఇదే సమయంలో చక్రాల కుర్చీకి పరిమితమైన ఓ ఇస్లాం మత విద్యావేత్త షేక్ అహ్మద్ యాసిన్ ఇజ్రాయెల్ దృష్టిలో పడ్డాడు. యాసర్ అరాఫత్‌ను, పీఎల్‌వోను యాసిన్ వ్యతిరేకించేవారు. దీంతో శత్రువుకు శత్రువు మిత్రుడైనట్లు.. సహజంగానే ఇజ్రాయెల్‌ను యాసిన్ ఆకర్షించాడు. ఆయన ముజామా అల్ ఇస్లామియా అనే సంస్థను స్థాపించి గాజాలోని పాలస్తీనీయుల కోసం ధార్మిక కార్యక్రమాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు నడిపేవాడు. వాటిని ఇజ్రాయెల్ గుర్తించింది. అరాఫత్‌ను కట్టడి చేసే వ్యూహంలో భాగంగా పాలస్తీనియన్లను విభజించి పాలించాలని చూసింది. అందుకే గాజాలో ఇస్లామిక్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు యాసిన్‌కు సహకరించింది. (అదే విశ్వవిద్యాలయం ఇప్పుడు హమాస్ మిలిటరీ కేంద్రంగా మారింది.)

**తక్కువ అంచనా వేసి..** పీఎల్‌వోతో విభేదించేలా ఆర్థికంగా యాసిన్‌కు ఇజ్రాయెల్ సాయం చేసింది. ఈ క్రమంలో ముజామా అల్ ఇస్లామియా సాయుధ బాటలోకి దిగుతోందని గుర్తించినా పీఎల్‌వోతో పోలిస్తే ఇది తక్కువ ప్రమాదకారి అనే ఉద్దేశంతో చూసీచూడనట్లు వదిలేసింది. అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నారనే కారణంతో 1984లో యాసిన్‌ను ఇజ్రాయెల్ అరెస్టు చేసింది. 12 ఏళ్ల జైలు శిక్ష పడింది. కానీ అరాఫత్ కంటే యాసిన్ తక్కువ ప్రమాదకరమని మరుసటి ఏడాదే విడిచిపెట్టింది. బయటకు వచ్చిన రెండేళ్లకే 1987లో యాసిన్ హమాస్‌ను ఏర్పాటు చేశారు. సరిగ్గా అదే సమయంలో ఇజ్రాయెల్ ఆక్రమణను నిరసిస్తూ పాలస్తీనీయులు భారీ ఎత్తున తిరుగుబాటుకు దిగారు. దీన్నే తొలి తిరుగుబాటుగా పిలుస్తారు. దానిని ఇజ్రాయెల్ అణచివేసింది. ప్రజల్లోని ఈ వ్యతిరేకతను హమాస్ బాగా సొమ్ము చేసుకుంది. 1988లో గాజాలో ఇజ్రాయెల్ సైనికులను కాల్చి చంపడం ద్వారా హమాస్ పేరు మారుమోగింది.

**ఆయుధాలు వీడిన అరాఫత్..** పాలస్తీనీయులు అసంతృప్తితో ఉన్న సమయంలో యాసర్ అరాఫత్ సారథ్యంలోని పీఎల్‌వో ఆయుధాలను వీడి రాజకీయ చర్చల బాట పట్టింది. ఇజ్రాయెల్‌తో సయోధ్యకు సిద్ధమైంది. ఇజ్రాయెల్‌ను యూదు దేశంగా గుర్తించింది. చాలామంది పాలస్తీనియన్లకు అరాఫత్ మెతక వైఖరి రుచించలేదు. ఇదే అదనుగా హమాస్ విజృంభించింది. గాజాలో ఆధిపత్యం కోసం పీఎల్‌వో, హమాస్‌ల మధ్య అంతర్యుద్ధం కొనసాగింది. దీన్ని చూసి ఇజ్రాయెల్ సంబరపడింది. 2004లో వైమానిక దాడిలో యాసిన్‌ను హతమార్చినా అప్పటికే హమాస్ బలపడింది. ఆ తరువాత ఇజ్రాయెల్ దళాలపైనా హమాస్ దాడులను తీవ్రతరం చేసింది. సైనికులను చంపింది.

తద్వారా పాలస్తీనియన్లకు సరికొత్త సారథిగా ఎదగడం ఆరంభించింది. 2006లో జరిగిన గాజా ఎన్నికల్లో పీఎల్‌వో ఓడిపోయి హమాస్ పట్టు పెంచుకుంది. ఆనాటి నుంచి ఇప్పటిదాకా హమాసే అక్కడ రాజ్యమేలుతోంది. పీఎల్‌వో అధినేత యాసర్ అరాఫత్ సైతం హమాస్ సృష్టికర్త ఇజ్రాయెలే అనేవారు. ఇప్పుడదే హమాస్ ఇజ్రాయెల్‌పై వినూత్న దాడులు, కిడ్నాప్‌లతో దడ పుట్టిస్తోంది.



# అసలేం జరిగింది..
# కుమార్తెలతో కలిసి తండ్రి ఆత్మహత్య

బోయిన్‌పల్లి: సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలో విషాద ఘటన చోటుచేసుకుంది. భవానీనగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలతోనే వీరు ప్రాణాలు తీసుకున్నట్లుగా తెలుస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లికి చెందిన శ్రీకాంత్ చారి (42)కి భూదాన్ పోచంపల్లికి చెందిన అక్షయకు 11 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి స్రవంతి (8), శ్రావ్య (7) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీకాంత్ సిల్వర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే కుటుంబ సభ్యులంతా కలిసి గురువారం రాత్రి భోజనం చేసి నిద్రించారు. ఉదయం లేచి చూస్తే పిల్లలతో సహా శ్రీకాంత్ విగతజీవిగా పడి ఉన్నాడు. ఇది గమనించిన భార్య అక్షయ.. కింది అంతస్తులో ఉంటున్న తన అత్త జయమ్మకు తెలిపారు. అయితే, దంపతుల మధ్య ఎప్పుడూ గొడవలు జరగలేదని స్థానికులు చెబుతున్నారు. భర్త, పిల్లలు ప్రాణాలు తీసుకోవడం పట్ల భార్య అక్షయపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబంలో కలహాలు లేదంటే ఆర్థిక వ్యవహారాలే ఆత్మహత్యకు కారణమై ఉండొచ్చని అంటున్నారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. రంగంలోకి దిగిన క్లూస్ టీమ్.. శ్రీకాంత్ నిద్రించిన ఇంట్లో ఆధారాలు సేకరించింది. సైనైడ్ తీసుకొని వీరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించింది. మరోవైపు ప్రాథమికంగా అక్షయను ప్రశ్నించిన పోలీసులు.. మరింత లోతుగా ఆమెను విచారించే అవకాశం ఉంది. తమ మధ్య తగాదాలు ఏమీ లేవని భార్య అక్షయ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రాత్రి భోజనం తర్వాత అందరం ఒకే చోట నిద్రించామని.. ఉదయం లేచి చూసేసరికి ఇలా జరిగిందన్నారు. కొడుకు, మనవరాళ్లు చనిపోవడానికి గల కారణాలు తమకే తెలియడం లేదని తల్లి జయమ్మ విలపిస్తోంది. రాత్రి అందరం బాగానే మాట్లాడుకున్నామని.. తమకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవన్నారు. కొన్నాళ్లుగా శ్రీకాంత్ వ్యాపారం సరిగా నడవడం లేదని పేర్కొన్నారు.

## వేముల మంజులమ్మకు నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ కవిత





హైదరాబాద్ : రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాతృమూర్తి వేముల మంజులమ్మ మృతిపట్ల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంతాపం ప్రకటించారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా వేల్పూరులో మంత్రి కుటుంబసభ్యులకు ఆమె తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మంజులమ్మ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. కాగా, కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మంజులమ్మ హైదరాబాద్ నగరంలోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ మంజులమ్మ గురువారం మృతి చెందారు.

## ప్రజాశాంతి పార్టీ తెలంగాణలో అధికారంలోకి రానుంది



హైదరాబాద్: ప్రజాశాంతి పార్టీ తెలంగాణలో అధికారంలోకి రానుందని ఆ పార్టీ అధ్యక్షుడు కేఏ.పాల్ జోస్యం చెప్పారు. ఆయన మీడియాతో మాట్లాడారు. "తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎక్కడ ఉంది?, మునుగోడు, హుజురాబాద్‌లో ఆ పార్టీకి డిపాజిట్లు రాలేదు. బీజేపీ అసలే లేదు.

దానం నాగేందర్ గులాబీ జెండా మోసే వాళ్లకే తప్ప వేరే వాళ్లకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వమని బెదిరిస్తున్నారు. పోలీసులకు ప్రజాశాంతి పార్టీ అండగా ఉంటుంది. ఆశావాహులంతా రూ.10 వేలు కట్టి బీ ఫామ్ పొందాలని" కేఏ.పాల్ కోరారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com